ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
1 వరంగల్
శుక్రవారం 26 ఏప్రిల్ 2024

కాంగ్రెస్‌లోకి ఎమ్మెల్సీ సారయ్య?

- రాజకీయ గురువు రామసహాయం సురేందర్‌రెడ్డితో భేటీ
- చర్చనీయాంశమైన గురుశిష్యుల కలయిక


2లో..

ముగిసిన నామినేషన్ల పర్వం

- వరంగల్‌లో 58 మంది, మహబూబాబాద్‌లో 29 మంది నామపత్రాల అందజేత
- చివరిరోజు అత్యధికంగా దాఖలు

వరంగల్ కలెక్టరేట్ / మహబూబాబాద్‌టౌన్, ఏప్రిల్ 25: పార్లమెంట్ ఎన్నికల నామినేషన్ల పర్వం పూర్తయ్యింది. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని వరంగల్, మహబూబాబాద్ పార్లమెంట్ స్థానాలకు చివరి రోజు గురువారం భారీ సంఖ్యలో నామినేషన్లు దాఖలయ్యాయి. మొత్తంగా వరంగల్‌లో 58మంది 89సెట్లు, మహబూబాబాద్‌లో 29మంది 56సెట్ల నామినేషన్లు అందజేశారు. నామినేషన్లు దాఖలు చేయగా.. చివరి రోజున 24 మంది తమ నామపత్రాలను అందజేశారు. చివరిరోజైన గురువారం బీజేపీ అభ్యర్థి అరురి రమేశ్, బీఎస్పీ అభ్యర్థి కల్పన, ధర్మసమాజ్ పార్టీ అభ్యర్థి మేకల సుమన్, ఎంసీపీఐ(యూ) అభ్యర్థి కొత్తపల్లి సావిత్రి, రిపబ్లిక్ పార్టీ ఆఫ్ ఇండియా అభ్యర్థి పసుల రవి, స్వతంత్ర అభ్యర్థులుగా సినీనటుడు, మాజీ మంత్రి పల్లి బాబుమోహన్, పోలేపాక రూప, మోత్కుపల్లి ప్రభాకర్, బర్ల బాబు, బీఆర్ఎస్ అభ్యర్థి మారపల్లి సుధీర్ కుమార్ తరుపున ఎమ్మెల్సీ రవీందర్‌రావు, తదితరులు నామినేషన్ దాఖలు చేశారు. మహబూబాబాద్ నియోజకవర్గంలో మొత్తం 29మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేయగా చివరిరోజైన గురువారం అత్యధికంగా 17మంది నామినేషన్లు దాఖలు చేశారు. బీజేపీ నుంచి

మిగతా 3వ పేజీలో..



మోగిన పట్టభద్రుల నగారా

వరంగల్, నల్గొండ, ఖమ్మం ఎమ్మెల్సీ స్థానానికి ఉపఎన్నిక

- జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి రాజీనామాతో ఖాళీ అయిన స్థానం
- మూడు ఉమ్మడి జిల్లాల్లో 4.63లక్షల గ్రాడ్యుయేట్ ఓటర్లు
- ఇప్పటికే కాంగ్రెస్ అభ్యర్థిగా తీన్మార్ మల్లన్న ఖరారు
- బీఆర్ఎస్ నుంచి వాసుదేవరెడ్డి పేరు పరిశీలన
- మళ్లీ గుజ్జుల వైపే బీజేపీ మొగ్గు!

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి - వరంగల్)

వరంగల్, నల్గొండ, ఖమ్మం పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానంలో ఉపఎన్నికకు నగారా మోగింది. ఈ మేరకు గురువారం ఎన్నికల సంఘం షెడ్యూల్ విడుదల చేసింది. గతంలో పట్టభద్రుల ఎమ్మెల్సీగా ఎన్నికైన పల్లా రాజేశ్వర్‌రెడ్డి గత అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ తరపున జనగామ ఎమ్మెల్యేగా విజయం సాధించటంతో ఆతర్వాత తన ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేశారు. దీంతో ఖాళీ అయిన ఈ ఈ పట్టభద్రుల స్థానానికి నిబంధనల ప్రకారం జూన్ 8వ

మిగతా 3వ పేజీలో..



మాట్లాడుతున్న ఉత్తరాఖండ్ సీఎం పుష్కర్‌సింగ్

కాంగ్రెస్, బీఆర్ఎస్ హక్కులను కాలరాస్తున్నాయి..

- బీజేపీకి సహకారమందిస్తే అభివృద్ధికి పెద్దపీట వేస్తాం..
- అరూరిని గెలిపిస్తే వరంగల్ అభివృద్ధి
- ఉత్తరాఖండ్ సీఎం పుష్కర్‌సింగ్ దామి

3లో..



మాట్లాడుతున్న హరీష్‌రావు

అబద్ధాలతో కాంగ్రెస్ గద్దెనెక్కింది

- గ్యారంటీలు వచ్చిన వారు కాంగ్రెస్‌కు.. రానివారు బీఆర్ఎస్‌కు ఓటేయాలి..
- వరంగల్ లోక్‌సభ సమావేశంలో మాజీ మంత్రి టి. హరీష్ రావు

4లో..



వరంగల్ మేయర్ గుండు సుధారాణికి కండువా కప్పుతున్న జగ్గారెడ్డి

కాంగ్రెస్‌లో చేరిన గుండు సుధారాణి

3లో..

త్రిసభ్య కమిటీ సమక్షంలో గాంధీభవన్‌లో చేరిక

మేయర్‌కు కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానం





జేఈఈ మెయిన్స్‌లో ఎస్ఆర్ విజయ దుందుభి

- జాతీయ స్థాయిలో జి.నవీన్‌కు 5వ ర్యాంకు
- 3,256 మంది విద్యార్థుల అర్హత

3లో..







ఏబీవీపీ కార్యకర్తలపై కేసు

హనుమకొండ టౌన్, ఏప్రిల్ 25: ప్రైవేట్ పాఠశాల ఫర్నిచర్ ధ్వంసం చేసిన ఏబీవీపీ కార్యకర్తలపై కేసు నమోదు చేసినట్లు హనుమకొండ పోలీసులు తెలిపారు. పోలీసుల కథనం ప్రకారం.. హనుమాన్‌నగర్‌లోని ఏకశిల హైస్కూల్‌లో గురువారం కొంతమంది విద్యార్థులు, ఉపాధ్యాయులు పాఠశాలకు హాజరయ్యారు. సమాచారం తెలుసుకున్న ఏబీవీపీ విద్యార్థులు పాఠశాలకు చేరుకొని ప్రభుత్వం సెలవులు ప్రకటించినప్పటికీ ఎలా తెరిచారని బూతులు తిడుతూ పాఠశాలలోని సుమారు రూ.50,000 విలువ గల ఫర్నిచర్ ధ్వంసం చేశారు. ఈఘటనలో పూలకుండీలు తాకి అటెండర్‌కు గాయాలయ్యాయి. పాఠశాల నిర్వాకురాలు శైలజారెడ్డి ఫిర్యాదు మేరకు పోలీసులు 15 మందిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

కాంగ్రెస్‌లోకి ఎమ్మెల్సీ సారయ్య?

ఖమ్మంలో రాజకీయ గురువు రామసహాయం సురేందర్‌రెడ్డితో భేటీ

చర్చనీయాంశంగా మారిన గురుశిష్యుల కలయిక



ఖమ్మంలో సురేందర్‌రెడ్డితో ముచ్చటిస్తున్న సారయ్య

వరంగల్‌సిటీ, ఏప్రిల్ 25: ఖమ్మం లోక్‌సభ అభ్యర్థిగా పోటీ చేస్తున్న రామసహాయం సురేందర్‌రెడ్డి కుమారుడు రఘురామిరెడ్డి పోటీ చేస్తున్న విషయం తెలిసిందే. కాగా గురువారం వరంగల్‌కు చెందిన బీఆర్ఎస్ ఎమ్మెల్సీ బస్వరాజు ఖమ్మం వెళ్లి తన రాజకీయ గురువు సురేందర్‌రెడ్డిని కలవడం హాట్‌టాపిక్‌గా మారింది. గురువు హామీ మేరకు సారయ్య కాంగ్రెస్‌లో చేరుతున్నాడంటూ సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది. సారయ్య పనితీరును మెచ్చి బీఆర్ఎస్ అధినేత పార్టీలో ప్రధాన కార్యదర్శి పదవితోపాటు ఎమ్మెల్సీగా అవకాశం కల్పించారు. గత ఎన్నికల సమయంలోనూ అనేక బాధ్యతలు అప్పగించారు. ఇటీవల వరంగల్ వచ్చిన మాజీ సీఎం కేసీఆర్ పర్యటనను విజయవంతం చేసేందుకు కృషి చేశారు. మొన్న నగరంలో కేటీఆర్ పాల్గొన్న సమావేశాల్లోనూ ఆయనతోనే సారయ్య ఉన్నారు. నగరంలో జరిగే బీఆర్ఎస్ సమావేశాల్లో ఉత్సాహంగా పాల్గొంటున్న సారయ్య గురువారం ఖమ్మంలో సురేందర్‌రెడ్డితో భేటీ అవడంతో అందరి చూపు ఆయనపై పడింది. సారయ్య కార్పొరేటర్ స్థాయి నుంచి మూడుసార్లు ఎమ్మెల్యేగా, మంత్రిగా, తెలంగాణ ప్రజాప్రతినిధుల ఫోరం అధ్యక్షుడిగా అవకాశం కల్పించడం వెనుక రాజకీయ గురువు సురేందర్‌రెడ్డి పాత్ర ఉందని సారయ్య, ఆయన అనుచరులు చెప్పుకుంటారు.

ఒకపక్క వరంగల్ మేయర్ గుండు సుధారాణి గురువారం హైదరాబాద్ వెళ్లి కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డితో కండువా కప్పించుకుని కాంగ్రెస్‌లో చేరింది. మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ సైతం పార్టీ మారుతున్నాడని, బీజేపీలో చేరడానికి ప్రయత్నం చేస్తున్నాడనే వార్తలు గుప్పుమన్నాయి. అయితే నరేందర్ మాత్రం బీఆర్ఎస్‌ను వీడేది లేదని తేల్చి చెప్పినా ప్రచారం మాత్రం ఆగడం లేదు. బీఆర్ఎస్ నాయకులు ఒక్కొక్కరుగా పార్టీలు మారుతుండడంతో సారయ్య కూడా పార్టీ మారుతున్నాడని ప్రచారం సాగుతోంది. సారయ్యకు ఫోన్ చేయగా ఆయన అందుబాటులోకి రాలేదు. గురుశిష్యుల కలయికను బీఆర్ఎస్ పార్టీ అధినేత కేసీఆర్, వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఎలా స్పందిస్తారో వేచి చూడాలి.

జేఈఈ మెయిన్స్‌లో ఎస్ఆర్ విజయదుందుభి

వరంగల్ ఎడ్యుకేషన్, ఏప్రిల్ 25 : నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) గురువారం ప్రకటించిన ప్రతిష్ఠాత్మక జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో ఎస్ఆర్ విద్యార్థులు విజయదుందుభి మోగించినట్లు ఆ విద్యా సంస్థల చైర్మన్ ఎ.వరదారెడ్డి అన్నారు. జాతీయ స్థాయిలో జి.నవీన్ 5వ ర్యాంకు, ఎ.నందిని 12, వై.సాత్విక్‌రెడ్డి 42, జి.కాలు 55 ర్యాంకులు సాధించగా, మరో 12మంది విద్యార్థులు 100 నుంచి 300 ర్యాంకులలోపు సాధించినట్లు ఆయన పేర్కొన్నారు. అలాగే డి.మనీష్ 126, డి.కార్తిక్ 131, జె.శ్రేతన్‌రెడ్డి 144, కె.ప్రశాంత్‌రెడ్డి 148, టి.తేజస్వీ 149, కె.అఖిల్‌యాదవ్ 154, పి.నిహాల్ శ్రీవాత్సవ్ 186, కె.శ్రీరామ్‌రెడ్డి 192, టి.అమృత వర్షిణి 201, కె.రమణారెడ్డి 211, టి.శ్రేష్ఠ 225, పి.రిత్విక్ 314 ర్యాంకులు సాధించారు. 2024 జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో ఎస్ఆర్ విద్యాసంస్థలకు చెందిన 3,256 మంది విద్యార్థులు అర్హత సాధించడం ఎస్ఆర్ విద్యాసంస్థల పేరు ప్రఖ్యాతులను పెంచిందని వరదారెడ్డి అన్నారు. విద్యాసంస్థల్లో పటిష్ఠమైన ప్రణాళికతో వినూత్న పద్ధతులు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుంటూ విద్యా బోధన చేస్తున్నామన్నారు. ఎప్పటికప్పుడు విద్యారంగంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా కరిక్యులమ్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. విద్యార్థుల్లో విద్యా చైతన్యాన్ని నింపుతూ తమ అధ్యాపకులు విద్యాబోధన చేస్తున్నారని కొనియాడారు. అనంతరం జేఈఈ మెయిన్స్‌లో అత్యుత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులను డైరెక్టర్లు మధుకర్‌రెడ్డి, సంతోష్‌రెడ్డితో కలిసి వరదారెడ్డి అభినందించారు.

జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో సిగ్మా జయభేరి


ఎస్.దేవిక ఎన్.దుర్గాభవాని సీహెచ్.సౌమ్య

వరంగల్ ఎడ్యుకేషన్, ఏప్రిల్ 25 : ఎన్‌టీఏ గురువారం ప్రకటించిన జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో అత్యుత్తమ ర్యాంకులు సాధించిన సిగ్మా కళాశాల విద్యార్థులు జయభేరి మోగించారని ఆ కళాశాల చైర్మన్ సూదుల జయపాల్‌రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. జేఈఈ 2024 ఫలితాల్లో సిగ్మా జూనియర్ కళాశాలకు చెందిన కె.చందు అనే విద్యార్థి 98.87 స్కోరు సాధించినట్లు ఆయన చెప్పారు. అలాగే ఇంటర్ బోర్డు బుధవారం ప్రకటించిన ఫలితాల్లోనూ సిగ్మా జూనియర్ కళాశాల విద్యార్థులు జయకేతనం ఎగురవేశారన్నారు. సెకండియర్ ఎంపీసీ విభాగంలో ఎస్.దేవిక 990, ఎం.సాత్విక 989, వి.అశ్విని 989 మార్కులు సాధించగా, బైపీసీలో సీహెచ్.సౌమ్య 989, ఫస్టియర్ ఎంపీసీలో ఎన్.దుర్గాభవాని 467, పి.అంజలి 466, జి.నందిని 466, పి.నేహారెడ్డి 465, ఎస్.చందన 465, బైపీసీలో బి.సాత్విక 434, పి.శ్రీజ434 మార్కులు సాధించారు. ఈసందర్భంగావిద్యార్థులను అభినందించారు.

కెరీర్ పాయింట్ విద్యార్థుల ప్రభంజనం


విద్యార్థులతో కెరీర్ పాయింట్ వరంగల్ బ్రాంచ్ నిర్వాహకులు

న్యూశాయంపేట, ఏప్రిల్ 25: ఎన్‌టీఏ గురువారం ప్రకటించిన జేఈఈ మెయిన్స్ 2024 ఫలితాలలో న్యూశాయంపేటలోని కెరీర్ పాయింట్ విద్యార్థులు ఆల్ ఇండియా స్థాయిలో వివిధ కేటగిరీలలో, సీఆర్ఎల్ విభాగంలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచారు. మొదటి బ్యాచ్‌తోనే బీటెక్ విభాగంలో జే.హనీరావు, ఆల్ ఇండియా 48వ ర్యాంకు, ఎం.చిత్రాంజలి ఆల్ ఇండియా 532వ ర్యాంకు, ఎల్.జశ్వంత్ ఆల్ ఇండియా 910వ ర్యాంకు, ఆర్.నిఖిల్ ఆల్ ఇండియా 2279వ ర్యాంకు, ఎం.ధనుంజయ్ ఆల్ ఇండియా 2464వ ర్యాంకు, ఎం.సంజయ్‌పాల్ ఆల్ ఇండియా 3137వ ర్యాంకు, పి.శ్రీజ ఆల్ ఇండియా 4563వ ర్యాంకు, కె.కీర్తి ఆల్ ఇండియా 4633వ ర్యాంకు, డి.దేవేందర్ ఆల్ ఇండియా 4836వ ర్యాంకు, ఎం.హిమబిందు ఆల్ ఇండి యా 5210వ ర్యాంకు, బి.అశ్రిత్‌గౌడ్ ఆల్ ఇండియా 5310వ ర్యాంకు, బి.సందీప్ ఆల్ ఇండియా 5685వ ర్యాంకు సాధించినట్లు కెరీర్ పాయింట్ వరంగల్ బ్రాంచ్ నిర్వాహకులు తెలిపారు. అలాగే కె.అఖిల్ నాయక్, జి.చరతార్థ్, బి.అరుణ్ కుమార్, కె.కిశోర్, ఆర్.విక్రమ్, కె.చిరదీప్ కౌషల్, ఎ.హేమంత్‌లు ఆల్ ఇండియా 10వేల లోపు ర్యాంకులు సాధించినట్లు తెలిపారు. 40 శాతం విద్యార్థులు ఐఐటీ-జేఈఈ పరీక్షకు అర్హత సాధించారు. ఈసందర్భంగా అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను కెరీర్ పాయింట్ వరంగల్ బ్రాంచ్ నిర్వాహకులు కరుణాకర్‌రావు, మధుపాల్‌రావు, శ్రీనివాస్, దేవేందర్‌రావు, రాజస్థాన్ కోటా ఫ్యాకల్టీ అభినందించారు.

రెజోనెన్స్ విజయభేరి


విద్యార్థులను అభినందిస్తున్న కళాశాల యాజమాన్యం

వరంగల్ ఎడ్యుకేషన్, ఏప్రి ల్ 25 : జేఈఈ మెయిన్ 2024 రెండో సెషన్ ఫలితాల్లో రెజోనెన్స్ విద్యాసంస్థల విద్యార్థులు అత్యద్భుతమైన ప్రతిభ కనబర్చి ఐఐటీ, జేఈఈ జాతీయస్థాయి 34వ ర్యాంకుతోపాటు ఎన్నో ఉత్తమ ర్యాంకులు సాధించినట్లు రెజోనెన్స్ విద్యాసంస్థల డైరెక్టర్ లెక్కల రాజిరెడ్డి తెలిపారు. ఎ.భరత్ కుమార్ 34వ ర్యాంకు, టి.శ్రీతమ్ 71వ ర్యాంకు, ఎస్.మాలిక్ 142, హెచ్.హరిచరణ్ 371, ఎల్.సంజన 406, సిహెచ్.ధీరజ్ 755, టి.రేనిత్ 1064, కె.జీవన్‌పాల్ 1123, బి.రామ్‌చరణ్ 1176, ఎం.ధీరజ్ 1545, బి.అరవింద్ 2808 ర్యాంకులను కైవసం చేసుకొని కళాశాలపేరును మరోసారి నిలబెట్టినట్లు పేర్కొన్నారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను లెక్కల రాజిరెడ్డి, మహేందర్‌రెడ్డి, మాదిరెడ్డి దేవేందర్‌రెడ్డి, లెక్కలరమ్య రాజిరెడ్డి, అకాడమిక్ డీన్ ఎస్.గోపాల్‌రావు అభినందించారు.

ఆర్‌డీ విద్యార్థుల ప్రభంజనం


పి.సింధు పి.సింధూజ జి.సునందత

వరంగల్ ఎడ్యుకేషన్, ఏప్రిల్ 25 : ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో ఆర్‌డీ కళాశాల విజయభేరి మోగించినట్లు కళాశాల యాజమాన్యం తెలిపింది. ప్రథమ సంవత్సరం ఫలితాల్లో ఎంపీసీ విభాగంలో 466, 466 మార్కులు సాధించడమే కాకుండా 460 మార్కులకు 11 మందికి పైగా సాధించినట్లు పేర్కొన్నారు. బీపీసీ విభాగంలో 436, 436 మార్కులతోపాటు 430 మార్కులకుపైగా 10 మంది విద్యార్థులు సాధించారని తెలిపారు. అలాగే ఇంటర్ ద్వితీయ సంవత్సరంలో 988, 985 మార్కులు సాధించడమేకాకుండా 980 మార్కులను పది మంది సాధించారని అన్నారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను కళాశాల యాజమాన్యం డాక్టర్ కోడూరి రామమూర్తి, బండి మల్లేశం ప్రత్యేకంగా అభినందించారు.

కృష్ణవేణి విజయకేతనం


విద్యార్థులతో కృష్ణవేణి ఐఐటీ, మెడికల్ అకాడమీ డైరెక్టర్ యార్లగడ్డ వెంకటేశ్వరరావు

ఖమ్మం ఖానాపురం హవేలి ఏప్రిల్ 25: బుధవారం రాత్రి విడుదల చేసిన ఐఐటీ - జేఈఈ (మెయిన్స్) ఫలితాలలో ఖమ్మం నగరంలోని కృష్ణవేణి కళాశాల విద్యార్థులు విజయకేతనం ఎగురవేశారని కళాశాల యాజమాన్యం తెలిపింది. కళాశాల చెందిన విద్యార్థులు జశ్వంత్ 66, డి. సోనియా 73, కె .స్నేహ 199, కె. మాధవరావు 466, సాయి కిరణ్ 947, నితిన్ 1083, రామ్ చరణ్ తేజ్ 1357, బి. నితిన్ 1922, జి. సంతోష్ 2136, ఎన్. నవదీప్ 2196, వి. సంతోష్ - 2355, ఎం. మోహిత్- 3119, ఎం. ఉజ్వాలా మానస 3899, డి. హరిత 3982, టి. త్రివేణి 4243, టి. గోపిచంద్ 4441, పి. రోహిత్ కుమార్ 4479, డి. ప్రేమ్ కుమార్ 4524, డి. జయశ్రీ - 5051, టి. సంతోష్ 5764, టి. సుష్మ 5818, జె. విందు 5835, డి. అరవింద్ 5841 ర్యాంకులు సాధించారని తెలిపారు. జాతీయస్థాయి జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో అత్యధిక ర్యాంకులు సాధించిన విద్యార్థులను కళాశాల డైరెక్టర్లు గొల్లపూడి జగదీష్, మాచవరపు కోటేశ్వరరావు, యార్లగడ్డ వెంకటేశ్వరరావు, కళాశాల ప్రిన్సిపాల్ గుర్రం రాంచంద్రయ్య, అకాడమిక్ ఇన్‌చార్జ్ ఏలూరి వంశీ కృష్ణ , నిరంజన్ అధ్యాపకులు అభినందించారు.

మోగిన ‘పట్టభద్రుల’ నగారా



(మొదటి పేజీ తరువాయి)

తేదీలోపు ఉపఎన్నిక నిర్వహించాల్సి ఉంది. ఈ క్రమంలోనే ఇప్పటికే ఉమ్మడి వరంగల్, నల్గొండ, ఖమ్మం జిల్లాలోని గ్రాడ్యుయేట్ ఓటర్ల నమోదు పూర్తవగా.. మొత్తం 4.63లక్షల మందితో ఓటరు జాబితాను సిద్ధం చేశారు. అయితే ఇందులో మహిళ ఓటర్ల కంటే పురుషులే అధికంగా ఉన్నారు. ఇప్పటికే పార్లమెంట్ ఎన్నికల్లో విజయం కోసం వ్యూహరచనలో ఉన్న రాజకీయ పార్టీలు పట్టభద్రుల స్థానంలోనూ పట్టు బిగించేందుకు కసరత్తు ముమ్మరం చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ అభ్యర్థిని ఇప్పటికే ప్రకటించగా, బీఆర్ఎస్, బీజేపీలు తమ అభ్యర్థుల ఎంపికకు కసరత్తు చేస్తున్నాయి.

పల్లా రాజీనామాతో ఉప ఎన్నిక..

వరంగల్, నల్గొండ, ఖమ్మం పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి 2021 మార్చి 14న ఎన్నికలు నిర్వహించారు. ఆరేళ్ల పదవీకాలంతో జరిగిన ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థిగా పోటీ చేసిన పల్లా రాజేశ్వర్‌రెడ్డి విజయం సాధించారు. 2027 మార్చి 13వ తేదీ వరకు పల్లా రాజేశ్వర్‌రెడ్డికి పదవీకాలం ఉన్నప్పటికీ, గతేడాది డిసెంబరులో జరిగిన శాసనసభ ఎన్నికల్లో జనగామ ఎమ్మెల్యేగా విజయం సాధించటంతో 2023 డిసెంబరు 9న తన ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేశారు. ఈ క్రమంలో నిబంధనల ప్రకారం ఉప ఎన్నిక నిర్వహించాల్సి ఉండగా ఆ గడువు జూన్ 8వ తేదీ వరకు ఉంది. ఈ నేపథ్యంలో గురువారం కేంద్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ విడుదల చేసింది. ఈ ఉప ఎన్నికల్లో పోటీ చేసి గెలిచే అభ్యర్థి 2027 మార్చి వరకు పదవిలో కొనసాగనున్నారు.

గులాబీ కోటపై కాంగ్రెస్ నజర్

నల్గొండ, వరంగల్, ఖమ్మం పట్టభద్రుల నియోజకవర్గానికి జరిగే ఉప ఎన్నికల్లో కచ్చితంగా గెలువాలని కాంగ్రెస్ లక్ష్యం పెట్టుకుంది. శాసనమండలిలో కాంగ్రెస్‌కు మెజార్టీ లేకపోవటంతో ప్రతి ఎమ్మెల్సీ ఎన్నిక ఆ పార్టీకి సవాల్‌గా మారింది. దీంతో నల్గొండ, వరంగల్, ఖమ్మం పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానంపై కాంగ్రెస్ పార్టీ ప్రత్యేక దృష్టి పెట్టింది. 2007లో ఈ నియోజకవర్గం ఏర్పడగా, అప్పటి నుంచి జరిగిన మూడు ఎన్నికల్లోనూ బీఆర్ఎస్ అభ్యర్థులే విజయం సాధించారు. దీంతో ఈసారి పక్కాగా పాగా వేయాలని కాంగ్రెస్ వ్యూహరచన చేస్తోంది. 2021 మార్చిలో జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటి చేసిన రాములునాయక్ నామమాత్రపు పోటీ ఇచ్చారు. అయితే ఆ ఎన్నికల్లో ద్వితీయ స్థానంలో నిలిచిన తీన్మార్ మల్లన్నను ప్రస్తుతం కాంగ్రెస్ అభ్యర్థిగా ప్రకటించారు. అలాగే తృతీయ స్థానంలో నిలిచిన ప్రొఫెసర్ కోదండరాం ప్రస్తుతం కాంగ్రెస్‌కు మద్దతుగా ఉండటంతో ఈసారి ఎమ్మెల్సీ ఉప ఎన్నికలో విజయం సాధిస్తామనే ధీమాతో కాంగ్రెస్ ఉంది. దీనికితోడు కాంగ్రెస్ పార్టీ ఈసారి భారీ ఎత్తున గ్రాడ్యుయేట్స్ ఓట్లను నమోదు చేసింది. తన నియోజకవర్గ పరిధిలో సాధ్యమైనంత వరకు ఎక్కువ సంఖ్యలో గ్రాడ్యుయేట్ ఓట్లను నమోదు చేయాలని ఎమ్మెల్యేకు పార్టీ టాస్క్ ఇచ్చింది. ఎమ్మెల్యేలు లేని చోట కీలక నేతలకు ఈ బాధ్యతలు అప్పగించింది. దీంతో పట్టభద్రుల ఓట్ల కోసం ఎమ్మెల్యేలు ప్రత్యేక క్యాంపులు కూడా నిర్వహించారు. నల్గొండ, వరంగల్, ఖమ్మం ఉమ్మడి జిల్లాల్లో దాదాపు ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌కు చెందినవారే అధికంగా ఉండటంతో గులాబీ కోటాలో పాగా వేయాలనే లక్ష్యంతో కాంగ్రెస్ ఉంది.

ఎమ్మెల్సీ ఎన్నికపై పార్టీల కసరత్తు...

వరంగల్, నల్గొండ, ఖమ్మం పట్టభద్రుల నియోజకవర్గంలో పట్టు సాధించేందుకు ప్రధాన పార్టీలు కసరత్తు చేస్తున్నాయి. ఎంపీ ఎన్నికల హడావిడిలో ఉన్న పార్టీలకు ఎమ్మెల్సీ ఉపఎన్నిక సవాల్‌గా మారింది. ఇప్పటికే కాంగ్రెస్ పార్టీ తీన్మార్ మల్లన్నను అభ్యర్థిగా ప్రకటించింది. గత ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేసిన మల్లన్న స్వల్ప ఓట్ల మెజార్టీతో ఓడిపోయారు. అప్పట్లో ఇండిపెండెంట్‌గా పోటీ చేసిన మల్లన్నకు బీసీ సామాజిక వర్గం నుంచి భారీగా ఓట్లు పోలయ్యాయి. అయితే ఈసారి కాంగ్రెస్ పార్టీ నుంచి టికెట్ రావటంతో మల్లన్న ప్రచారానికి శ్రీకారం చుట్టారు. అలాగే గత మూడు పర్యాయాలు ఈ స్థానంలో పాగా వేసిన బీఆర్ఎస్ ఈసారి కూడా జెండా ఎగురవేయాలని ప్రయత్నాలు చేస్తోంది. కేయూ జాక్ నేత, తెలంగాణ ఉద్యమకారుడు కే.వాసుదేవరెడ్డిని బరిలో దించాలనే ఆలోచనలో పార్టీ ఉన్నట్టు సమాచారం. గత పదేళ్లు వికలాంగుల సంస్థ చైర్మన్‌గా పని చేసిన వాసుదేవరెడ్డి ఎమ్మెల్సీ స్థానంపై గురి పెట్టి ఓటరు నమోదు చేపట్టారు. మరోవైపు బీజేపీ నుంచి అభ్యర్థి ఎవరు అనేది చర్చనీయాశంగా మారింది. గత రెండు ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థిగా పోటీ చేసిన గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డికి మరోసారి అవకాశం ఇస్తారా లేదంటే కొత్త అభ్యర్థిని బరిలో దించుతారా అనేది చర్చనీయాంశంగా మారింది. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానం నుంచి పోటీకి బీజేపీకి చెందిన పది మందికి పైగా ఆశావహులు సిద్ధంగా ఉన్నారు. మొత్తానికి ఎమ్మెల్సీ ఉప ఎన్నికను అన్ని పార్టీలు ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంటుండటం, ఇప్పటికే పార్లమెంట్ ఎన్నికల సందడి ఉన్న నేపథ్యంలో ఎమ్మెల్సీ ఉపఎన్నిక రావడంతో రాజకీయాలు మరింత వేడెక్కుతున్నాయి.

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రక్రియ సాగనుందిలా..

వరంగల్, నల్గొండ, ఖమ్మం పట్టభద్రుల స్థానానికి కేంద్ర ఎన్నికల సంఘం ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం.. మే 2వ తేదీన ఉప ఎన్నికకు నోటిఫికేషన్ జారీ చేయనున్నారు. అదే రోజు నుంచి 9వ తేదీ వరకు నల్గొండ కలెక్టరేట్‌లోని రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో నామినేషన్లు స్వీకరిస్తారు. 10వ తేదీన నామినేషన్ల పరిశీలన చేస్తారు. 13వ తేదీ వరకు నామినేషన్ల ఉపసంహరణకు గడువు ఉంటుంది. 27వ తేదీ ఉదయం 8గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు పోలింగ్, జూన్ 5న ఓట్ల లెక్కింపు ఉంటుంది.

నియోజకవర్గంలో జిల్లాల వారీగా పట్టభద్ర ఓటర్ల సంఖ్య

జిల్లా	పురుషులు	మహిళలు	ఇతరులు	మొత్తం
నల్గొండ	51,501	29,274	-	80,775
సూర్యాపేట	34,146	17,311	-	51,457
యాదాద్రి భువనగిరి	20,794	13,218	-	34,012
జనగామ	14,870	8,470	01	23,341
సిద్దిపేట	3,118	1,553	-	4,671
మహబూబాబాద్	22,891	11,951	-	34,842
వరంగల్	26,952	16,715	-	43,667
హనుమకొండ	25,690	17,950	-	43,640
భూపాలపల్లి	7,965	4,513	-	12,478
ములుగు	6,571	3,695	-	10,266
ఖమ్మం	50,552	33,104	04	83,660
భద్రాది కొత్తగూడెం	22,540	17,477	-	40,017
మొత్తం	2,87,590	1,75,231	05	4,62,826

కాంగ్రెస్‌లో చేరిన గుండు సుధారాణి

- త్రిసభ్య కమిటీ సమక్షంలో గాంధీ భవన్‌లో చేరిక
- కాంగ్రెస్ కండువా కప్పిన జగ్గారెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న కార్పొరేటర్ నరేంద్రకుమార్

వరంగల్ కార్పొరేషన్/ వరంగల్ సిటీ, ఏప్రిల్ 25 : వరంగల్ మేయర్ గుండు సుధారాణి బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరారు. కాంగ్రెస్ త్రిసభ్య కమిటీ సమక్షంలో హైదరాబాద్ గాంధీభవన్‌లో ఆమె కాంగ్రెస్ తీర్థం పుచ్చుకోగా.. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి ఆమెకు పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. తనకు కాంగ్రెస్‌లో చేరడం చాలా సంతోషంగా ఉందని ఈ సందర్భంగా సుధారాణి పేర్కొన్నారు.

బీఆర్ఎస్ నుంచి మేయర్‌గా ఎన్నిక

2021లో జరిగిన మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో గ్రేటర్ వరంగల్‌లోని 66 డివిజన్లలో బీఆర్ఎస్ 48, బీజేపీ 10, కాంగ్రెస్ నలుగురు, స్వతంత్రులు నలుగురు కార్పొరేటర్లుగా గెలుపొందారు. ఈ క్రమంలో బీఆర్ఎస్ నుంచి గెలిచిన గుండు సుధారాణి మేయర్‌గా ఎన్నికయ్యారు. కానీ అసెంబ్లీ ఎన్నికల తర్వాతి పరిణామాల నేపథ్యంలో ఆమె కాంగ్రెస్‌లో చేరతారన్న ప్రచారం జరగ్గా.. గురువారం ఆమె హస్తం గూటికి చేరారు. దీంతో స్థానిక కాంగ్రెస్ నాయకులు కంగుతిన్నారు. మూడు నెలల కిందట సుధారాణి కాంగ్రెస్‌లో చేరేందుకు ప్రయత్నిస్తున్నారని తెలియడంతో ఇక్కడి కాంగ్రెస్ నాయకులు పార్టీ పెద్దలను కలిసి మేయర్‌ను చేర్చుకోవద్దని డిమాండ్ చేసినట్టు తెలిసింది. కానీ సుధారాణి మాత్రం ప్రయత్నాలను కొనసాగించి వరంగల్‌కు చెందిన కీలక నాయకులు, ఎమ్మెల్యేలకు చెప్పకుండా కాంగ్రెస్‌లో చేరారనే చర్చ జరుగుతోంది. ఆమె చేరికను తూర్పులోని కొందరు కార్పొరేటర్లు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. ఇదిలా వుండగా, ఇటీవల చేరిన కార్పొరేటర్ల సంఖ్యతో కార్పొరేషన్‌లో కాంగ్రెస్ బలం 36కు చేరింది. అయితే సుధారాణి చేరికను వ్యతిరేకిస్తున్న నేపథ్యంలో పార్లమెంట్ ఎన్నికల తర్వాత ఆమె అవిశ్వాస తీర్మానం పెట్టే యోచనలో కొందరు కార్పొరేటర్లు ఉన్నట్లు సమాచారం.

మేయర్‌పై అవిశ్వాస తీర్మానం పెట్టుడే : కార్పొరేటర్

మేయర్ గుండు సుధారాణి దొడ్డిదారిన కాంగ్రెస్‌లో చేరినంత మాత్రాన తాము ఊరుకునే ప్రసక్తేలేదని, ఆమెపై అవిశ్వాసం తీర్మానం పెట్టుడు ఖాయమని 20వ డివిజన్ కార్పొరేటర్ గుండేటి నరేంద్రకుమార్ స్పష్టం చేశారు. గురువారం ఆయన రాంకీ ఎన్‌క్లేవ్‌లోని తన నివాసంలో తూర్పు కార్పొరేటర్లతో కలిసి విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. సుధారాణి ఒంటరిగా వెళ్లి పార్టీలో చేరిందని, తూర్పు నియోజకవర్గ కార్పొరేటర్లు ఆమె రాకను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్టు స్పష్టం చేశారు. మంత్రి, తూర్పు, పశ్చిమ ఎమ్మెల్యేలను కాదని పార్టీలో చేరడం ఏ మేరకు సబబని ప్రశ్నించారు. ఆమెపై అవిశ్వాసం పెడితే తాము సహకరిస్తామని తన పార్టీ నాయకులే చెబుతున్నామని, కాంగ్రెస్ కార్పొరేటర్లు 36మంది ఉన్నామని అవిశ్వాసం పెట్టితీరతామని స్పష్టం చేశారు. సుధారాణి అంతులేని అవినీతికి పాల్పడిందని, ఆమె పనితీరు పూర్తిగా లోపభూయిష్టంగా ఉందని ఆరోపించారు. ఈ విషయాన్ని కొండా దంపతులు అధిష్ఠానం దృష్టికి తీసుకెళ్లి ఆమెను అడ్డుకోవాలని కోరుతున్నామన్నారు. పార్టీలోకి రావాలంటే కొండా సురేఖ, మురళీధర్‌రావు దంపతులను ఒప్పించి రావాలి తప్ప ఒంటరిగా వెళ్లి చేరడం విడ్డూరంగా ఉందన్నారు. మేయర్ సుధారాణి ఒంటరిదైపోయిందని, బీఆర్ఎస్ సైతం ఆమెను వెలివేసిందని, పార్టీని మోసం చేసిందని చెప్పి ప్రొటోకాల్ నుంచి తీసివేశారని ఆరోపించారు. ఇటీవల వరంగల్‌లో జరిగిన పార్టీ సమావేశాలకు ఆమెను ఆహ్వానించలేదని, ఆమె ఇప్పుడు ఒక చెల్లని రూపాయి అని, నెత్తిమీద రూపాయి పెడితే పావలాకు తీసుకునేవారు లేరన్నారు. ఆమె దొడ్డిదారిన సీతక్క, వేం నరేందర్‌రెడ్డి, చంద్రబాబు నాయుడు ద్వారా ప్రయత్నాలు చేసి ఎట్టకేలకు ఒంటరిగా ఈ రోజు పార్టీలో చేరిందని మండిపడ్డారు.

కాంగ్రెస్, బీఆర్ఎస్ ప్రజల హక్కులను కాలరాస్తున్నాయి

- మోదీ ఆశీస్సులున్న అరూరిని గెలిపిస్తే వరంగల్ అభివృద్ధి
- ఉత్తరాఖండ్ సీఎం పుష్కర్‌సింగ్ దామి



హనుమకొండ చౌరస్తాలో మాట్లాడుతున్న ఉత్తరాఖండ్ సీఎం పుష్కర్‌సింగ్ దామి
హనుమకొండ చౌరస్తాలో బీజేపీ నేతల భారీ ర్యాలీ

హనుమకొండ టౌన్, ఏప్రిల్ 25 : బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు ప్రజల సొమ్మును దోచుకుతింటూ, వారి హక్కులను కాలరాస్తున్నాయని, అలాంటి పార్టీలను దరిదాపుల్లోకి రానివ్వొద్దని ఉత్తరాఖండ్ సీఎం పుష్కర్‌సింగ్ దామి పిలుపునిచ్చారు. బీజేపీ వరంగల్ లోక్‌సభ అభ్యర్థి అరూరి రమేశ్ ఆధ్వర్యంలో వేయిస్తంభాల ఆలయం నుంచి అంబేద్కర్ విగ్రహం వరకు వందలాది మంది కార్యకర్తలతో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న సీఎం.. హనుమకొండ చౌరస్తాలోని రోడ్డు షోలో మాట్లాడారు. దేశ ప్రజల బాగు కోసం మోదీ రాత్రి, పగలు తేడా లేకుండా నిద్రాహారాలు మాని నిరంతరం కష్టపడుతుంటే.. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు మాత్రంప్రజల సొమ్మును ఎలా దోచుకోవాలో అని రాత్రింబవళ్లు ఆలోచన చేస్తున్నాయని ఎద్దేవా చేశారు. ఎన్నో ఏళ్లుగా వివాదంలో ఉన్న అయోధ్యలో రామమందిర సమస్య పరిష్కరించి అద్భుతంగా బాలరాముడి మందిరాన్ని నిర్మించిన ఘనత మోదీకే దక్కిందన్నారు.

ఈ 10 ఏళ్లలో మోదీ వరంగల్‌కు రైల్వే మ్యాన్‌ఫ్యాక్చరింగ్, నేషనల్ హైవేస్‌లతోపాటు కేంద్ర ప్రభుత్వ నిధులతో చాలా అభివృద్ధి పనులు చేశాడని గుర్తు చేశారు. మూడోసారి ప్రజలు సహకారం అందిస్తే అభివృద్ధిలో రాజీలేకుండా పనిచేస్తామన్నారు. బీజేపీ వరంగల్ అభ్యర్థి అరూరికి మోదీ ఆశీస్సులు ఉన్నాయని, వరంగల్ ప్రజలు అరూరిని లోక్‌సభకు పంపిస్తే వరంగల్‌కు నిధులు వరదలా వస్తాయన్నారు. కశ్మీరు నుంచి కన్యాకుమారి వరకు 400 సీట్లు గెలవబోతున్నామని ధీమా వ్యక్తం చేశారు. 43డిగ్రీల సెల్సియస్ ఎండ ఉన్నప్పటికీ లెక్కచేయకుండా జనం తరలివచ్చారంటే అరూరి రమేశ్ గెలుపు ఖాయమని అర్థమైపోయిందన్నారు. అరూరికి మద్దతు తెలిపేందుకు దైవభూమి ఉత్తరాఖండ్ నుంచి ఇక్కడ వచ్చానని ఉత్తరాఖండ్ సీఎం పుష్కర్‌సింగ్ దామి పేర్కొన్నారు.

కాంగ్రెస్ మునిగిపోయే పడవ

లోక్‌సభ ఫలితాల తర్వాత కాంగ్రెస్ మునిగిపోవడం ఖాయమని రాజ్యసభ సభ్యుడు, ఓబీసీ రాష్ట్ర అధ్యక్షుడు కె.లక్ష్మణ్ ఎద్దేవా చేశారు. తెలంగాణలో భవిష్యత్ ఉందంటే.. అది కేవలం ఒక్క బీజేపీ పార్టీకే అన్నారు. బీఆర్ఎస్ చచ్చిపోయిన పాము అని అభివర్ణించారు. బీఆర్ఎస్ వద్దనుకొని కాంగ్రెస్‌ను గెలిపించుకుంటే.. అధికారంలోకి వచ్చిన నాలుగు నెలల్లోనే ప్రజలను అరిగోస పెడుతోందని ధ్వజమెత్తారు. ఆరు గ్యారంటీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం.. ఇప్పుడు రాహుల్ గాంధీని ప్రధాని చేస్తేనే హామీలన్నీ తీర్చుతామని కొత్త రాగం ఎత్తుకుందని, రాహుల్ ప్రధాని అయ్యేది లేదు.. హామీలు నెరవే ర్చేది లేదని ఎద్దేవా చేశారు. మోదీని విమర్శించేందుకు ఏమి లేక అభివృద్ధిని పక్కకు పెట్టి కాంగ్రెస్ కులం, మతం పేరిట రాజకీయాలు చేస్తోందని విమర్శించారు. బీజేపీ రాముడు పేరిట రాజకీయాలు చేస్తోందని మాటాడుతున్న రేవంత్‌రెడ్డి.. దేవుళ్ల మీద ప్రమాణాలు చేసి ఆగస్టు వరకు రుణమాఫీ చేస్తానని కొత్త నాటకానికి తెరతీస్తున్నాడని విమర్శించారు. వరంగల్ సమగ్ర అభివృద్ధి జరగాలంటే అరూరిని గెలిపించి పార్లమెంట్‌కు పంపించాలన్నారు.

ప్రజలు నీ మీదే చార్జిషీటు వేస్తారు..

చార్జిషీటు బీజేపీపై కాదు.. ఎన్నికల తర్వాత ప్రజలు నీపై వేస్తారని మల్కాజిగిరి లోక్‌సభ బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్ రేవంత్‌రెడ్డిపై మండిపడ్డారు. బీజేపీ హయాంలో 2లక్షల 53 వేల ఇళ్ల మంజూరు చేసినప్పటికీ పేదల సొంతింటి కలను నెరవేర్చని కేసీఆర్‌పై చార్జిషీటు వేయాలన్నారు. 2జీ స్కామ్, బోఫోర్స్ స్కామ్‌లో లేనందుకు చార్జిషీటు వేస్తావా? అని ప్రశ్నించారు. గ్రామాల్లో జరిగే ప్రతీ అభివృద్ధి కేంద్ర నిధులతోనే జరుగుతోందనే విషయం గుర్తుంచుకోవాలన్నారు. ఆరు గ్యారంటీలనే అమలు చేయలేని సీఎం.. రూ.2లక్షల రుణమాఫీ ఎలా చేస్తాడని ఈటల ప్రశ్నించారు.

భూకబ్జాలు నిరూపిస్తే ప్రజలకు అప్పగిస్తా..

భూకబ్జాలు చేసినట్టు నిరూపిస్తే తన ఆస్తులన్నీ ప్రజలకు దానం చేస్తానని వరంగల్ బీజేపీ లోక్‌సభ అభ్యర్థి ఆరూరి రమేశ్ సవాల్ విసిరారు. నిరూపించకుంటే సీఎం రేవంత్‌రెడ్డి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. 50 యేళ్ల కాంగ్రెస్ పాలనలో అభివృద్ధి శూన్యమని అన్నారు. కడియం బీఆర్ఎస్‌కు, టీడీపీకి వెన్నుపోటు పొడిచినట్లే.. రానున్న రోజుల్లో కాంగ్రెస్‌కు కూడా వెన్నుపోటు పొడుస్తాడని అన్నారు. వరంగల్ ప్రజలు నిండు మనస్సుతో ఆశీర్వదిస్తే దేశంలోనే వరంగల్ పార్లమెంట్‌ను ముందు వరుసలో నిలబెడుతానని అన్నారు.

వివిధ కళారూపాలతో సాగిన రోడ్ షో

బీజేపీ రోడ్ షో ఉత్సాహంగా సాగింది. వేయిస్తంభాల ఆలయం దగ్గరి నుంచి అంబేద్కర్ వరకు సుమారు 2 గంటల పాటు వివిధ కళారూపాలతో రోడ్డుషో కొనసాగింది. వివిధ జిల్లాల నుంచి వచ్చిన కళాకారులు రోడ్డుపై తమ ప్రదర్శనలు ఇచ్చారు. ఉత్తరాఖండ్ సీఎం పుష్కర్‌సింగ్ దామి చౌరస్తా వరకు రోడ్డుషోలో పాల్గొని వెనుతిరిగారు. జంక్షన్‌లలో నాయకులు ప్రసంగించారు. అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి రోడ్డుషోను ముగించారు. ఈ రోడ్డు షోలో బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి, మాజీ రాజ్యసభ సభ్యుడు గరికపాటి మోహన్‌రావు, నాయకులుమార్తినేని ధర్మారావు, ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండేటి శ్రీధర్, జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ, ఎర్రబెల్లి ప్రదీప్‌రావు, మురళీధర్, విజయచందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


వరంగల్ లోక్‌సభ రిటర్నింగ్ అధికారి ప్రావీణ్యకు స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ పత్రాలు అందజేస్తున్న బాబుమోహన్

ముగిసిన నామినేషన్ల పర్వం

(మొదటి పేజీ తరువాయి)

అజ్మీరా సీతారాంనాయక్ మరోసెట్‌ను అందజేయగా.. తెలంగాణ జాగీర్ పార్టీ నుంచి వాంకుడోతు రవికుమార్, స్వతంత్ర అభ్యర్థిగా గుగులోతు శేఖర్ మరో రెండు సెట్‌లు, బీఆర్ఎస్ నుంచి సిట్టింగ్ ఎంపీ మాలోతు కవిత మరో రెండు సెట్లు స్వతంత్ర అభ్యర్థిగా పోరిక అశోక్, సోషలిస్టు పార్టీ ఆఫ్ ఇండియా నుంచి బూర్క కృష్ణవేణి, బీజేపీ డమ్మీ అభ్యర్థిగా జాటోతు జమున రెండు సెట్‌లు, స్వతంత్ర అభ్యర్థిగా బోడ అనిల్ మరోసెట్, స్వతంత్ర అభ్యర్థిగా మైపతి అరుణ్‌కుమార్ మరోసెట్, ధర్మ సమాజ్ పార్టీ నుంచి రవ్వ భద్రమ్మ, స్వతంత్ర అభ్యర్థిగా బానోత్ ప్రేమ్‌లాల్ మరోసెట్, స్వతంత్ర అభ్యర్థిగా ధరావత్ వెంకన్న, స్వతంత్ర అభ్యర్థిగా లకావత్ లక్ష్మీనారాయణ మూడుసెట్‌లు, గోండువాన గణతంత్ర పార్టీ నుంచి సోయం కన్నారాజు మరోసెట్, బీఎస్పీ నుంచి కోనేటి సుజాత మూడు సెట్లు దాఖలు చేశారు. ఇక నోటిఫికేషన్ ప్రకారం శుక్రవారం నామినేషన్ల పరిశీలన ప్రారంభం కానుండగా ఇందుకోసం జిల్లా ఎన్నికల అధికారి చర్యలు చేపట్టారు. అలాగే 29న నామినేషన్ల ఉపసంహరణ జరగనుండగా ఆ తర్వాత బరిలో నిలిచే అభ్యర్థుల తుది జాబితా, గుర్తులు వెలువడనున్నాయి. నామినేషన్ల ప్రక్రియను సజావుగా నిర్వహించడంలో పోలీసులు కీలకపాత్ర పోషించారు. వరంగల్ రిటర్నింగ్ అధికారి కార్యాలయం సమీపంలో హనుమకొండ ఏసీపీ దేవేందర్‌రెడ్డి పర్యవేక్షణలో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. నామినేషన్ల ప్రక్రియ ఎలాంటి ఘటనలు జరగకుండా సజావుగా ముగియడంతో అధికార యంత్రాంగం ఊపిరి పీల్చుకుంది.


వరంగల్ లోక్‌సభ రిటర్నింగ్ అధికారి ప్రావీణ్యకు నామినేషన్ పత్రాలు అందజేస్తున్న బీఎస్పీ అభ్యర్థి కల్పన


మహబూబాబాద్‌లో బీఎస్పీ అభ్యర్థిగా నామినేషన్ వేస్తున్న కోనేటి సుజాత

నామినేషన్ కౌంటర్

చివరి రోజు (25-4-2024)

దాఖలైన మొత్తం నామినేషన్లు	
వరంగల్	మహ-బాద్
77	55

- **వరంగల్ (ఎస్సీ) :** అరూరి రమేశ్ (3 సెట్లు బీజేపీ), మారపల్లి సుధీర్ కుమార్ తరుపున ఎమ్మెల్సీ రవీందర్‌రావు ఒక సెట్ (బీఆర్ఎస్), కల్పన (బీఎస్పీ), మేకల సుమన్ (ధర్మసమాజ్ పార్టీ), కొత్తపల్లి సావిత్రి (ఎంసీపీఐ(యూ), పసుల రవి (రిపబ్లిక్ పార్టీ ఆఫ్ ఇండియా), బి.సుధాకర్ (సోషలిస్టు ఇండియా), మార్త రాజభద్రయ్య (2 సెట్లు బీజేపీ), గాదం మల్లేశం (జై భారత్ నేషనల్ పార్టీ), గజ్జ దయాకర్ (బీఎస్పీ నుంచి ఒక సెట్, స్వతంత్ర అభ్యర్థి మరో సెట్), అందె యాకయ్య (బీఆర్ఎస్ నుంచి ఒక సెట్, స్వతంత్ర అభ్యర్థిగా మరో సెట్), గంగారపు రామకృష్ణ (రిపబ్లిక్ పార్టీ ఆఫ్ ఇండియా), పి.లక్ష్మీనారాయణ (ఆమ్ ఆద్మీ పార్టీ)

స్వతంత్రులు : బాబుమోహన్, పోలెపాక రూప, మోత్కుపల్లి ప్రభాకర్, బర్ల బాబు, పి.కృష్ణసాగర్, కుమ్మరి కన్నయ్య, మంగళంపల్లి ఆశయ్య, చిలుముల్ల సుజాత, తాండ్ర ఈశ్వర్, గడ్డం చిరంజీవి, వి.విజయ్ కుమార్, గనిపాక ప్రదీప్, గాదె సురేశ్, సీనపెల్లి శంకర్, గనిపాక రవీందర్, మాతంగి కావ్యశ్రీ, నద్దునూరి సంపత్, యాసారపు కర్ణాకర్, సి.ప్రభాకర్

- **మహబూబాబాద్ (ఎస్టీ) :** అజ్మీరా సీతారాంనాయక్ (బీజేపీ), వాంకుడోతు రవికుమార్ (తెలంగాణ జాగీర్ పార్టీ), మాలోతు కవిత (2 సెట్లు-బీఆర్ఎస్), బూర్క కృష్ణవేణి (సోషలిస్టు పార్టీ ఆఫ్ ఇండియా), జాటోతు జమున (2 సెట్లు-బీజేపీ), రవ్వ భద్రమ్మ (ధర్మ సమాజ్ పార్టీ), సోయం కన్నారాజు (గోండువాన గణతంత్ర పార్టీ), కోనేటి సుజాత (3 సెట్లు-బీఎస్పీ)

స్వతంత్రులు : గుగులోతు శేఖర్ (2 సెట్లు), పోరిక అశోక్, బోడ అనిల్, మైపతి అరుణ్‌కుమార్, బానోత్ ప్రేమ్‌లాల్, ధరావత్ వెంకన్న, లకావత్ లక్ష్మీనారాయణ (3 సెట్లు), జాటోతు చక్రవర్తి, బోడ ప్రశాంత్




ఉర్సు పోలింగ్ కేంద్రాన్ని సందర్శించిన కమిషనర్

మే 8లోపు పోల్‌స్లిప్పులు అందించాలి

వరంగల్ కార్పొరేషన్, ఏప్రిల్ 25: గ్రేటర్ వరంగల్ నగర పాలక సంస్థ పరిధిలో ఉన్న ప్రజలకు మే 8వ తేదీలోగా అన్ని కుటుంబాలకు పోలింగ్ చిట్టీలు పంపిణీ చేయాలని నగర పాలక సంస్థ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే అధికారులకు సూచించారు. గురువారం నగరంలో పలు ప్రాంతాల్లో పర్యటించి పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. ఉర్సు, శంభునిపేట, పెరుక వాడలోని పోలింగ్ కేంద్రాలను సందర్శించి అక్కడి సౌకర్యాలపై అడిగి తెలుసుకున్నారు. కమిషనర్ వెంట తహసీల్దార్ నాగేశ్వర్‌రావు, డీఈలు రవికుమార్, సారంగం, కృష్ణమూర్తి, ఏఈ సరితలు ఉన్నారు.

ఓపెన్ పరీక్షకు ఒకరికి బదులు మరొకరు...

• వరంగల్ నరేంద్రనగర్ ప్రభుత్వ పాఠశాల కేంద్రంలో ఘటన
• పోలీసులకు ఫిర్యాదు చేసిన నిర్వాహకులు

వరంగల్ ఎడ్యుకేషన్, ఏప్రిల్ 25: ఓపెన్ స్కూల్ పరీక్షల్లో ఒకరికి బదులుగా మరొకరు పరీక్షకు హాజరైన ఘటన వరంగల్ నగరంలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే ఓపెన్ స్కూల్ టెన్త్, ఇంటర్ పరీక్షలు గురువారం నుంచి ప్రారంభమయ్యాయి. వరంగల్ మండలం నరేంద్ర నగర్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రలో పరీక్ష రాసేందుకు ఒకరికి బదులుగా మరొకరు టెన్త్ పరీక్ష రాస్తుండగా పరిశీలనకు వచ్చిన డీఈవో వాసంతి గుర్తించారు. దీంతో డీఈవో ఆదేశాల మేరకు పరీక్ష కేంద్రం నిర్వాహకులు మట్టెవాడ పోలీస్ స్టేషన్‌లో ఇద్దరు విద్యార్థులపై ఫిర్యాదు చేశారు.

నిబంధనలకు విరుద్ధంగా ఇన్విజిలేటర్లు...

ఓపెన్ టెన్త్, ఇంటర్ పరీక్షల్లో ఇన్విజిలేటర్ల నియామకం ఇష్టారాజ్యంగా మారినట్లు పలువురు ఉపాధ్యాయులు ఆరోపిస్తున్నారు. ఓపెన్ టెన్త్, ఇంటర్ పరీక్షల్లో విధులు నిర్వర్తిస్తే సంపాదిత సెలవులతో రూ. 10వేల నుంచి రూ. 15వేల వరకు అదనంగా వస్తుండటంతో ఈ డ్యూటీలు చేసేందుకు కొంత మంది ఉపాధ్యాయుడుల పైరవీలు చేసుకొని మరీ డ్యూటీలు చేస్తున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఓపెన్ స్కూల్ స్టడీ సెంటర్‌లో కౌన్సిలర్లుగా చేసేవారికి విధులు కేటాయించిన తర్వాతనే సీనియారిటీని బట్టి అదే పాఠశాల లేదా పక్కనున్న పాఠశాలలోని ఉపాధ్యాయులకు డ్యూటీలు వేయాల్సి ఉండగా అలా కాకుండా ఇష్టారీతిన డ్యూటీలు వేసినట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

అబద్ధాలతో కాంగ్రెస్ గద్దెనెక్కింది

• గ్యారెంటీలు వచ్చిన వారు కాంగ్రెస్‌కు.. రానీవారు బీఆర్‌ఎస్‌కు ఓటు వేయాలి
• వరంగల్ ఎంపీ ఎన్నికల సన్నాహక సమావేశంలో తన్నీరు హరీష్ రావు


సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు

తొర్రూరు రూరల్ (మహబూబాబాద్ జిల్లా), ఏప్రిల్ 25: కాంగ్రెస్ ప్రభుత్వం అబద్ధాలతో గద్దెనెక్కిందని.. పూర్తిస్థాయిలో ఆరు గ్యారెంటీలు వచ్చిన వారు కాంగ్రెస్‌కు.. రానీవారు బీఆర్‌ఎస్ ఓటు వేయాలని బీఆర్‌ఎస్ నేత, మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్ రావు పిలుపునిచ్చారు. తొర్రూరు మండలం వెల్లికట్టె గ్రామశివారులో గురువారం జరిగిన వరంగల్ పార్లమెంట్ ఎన్నికల సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజా సమస్యలే ఎజెండా, కాంగ్రెస్ బీజేపీ మోసాలను ఎండగడుతూ పార్లమెంట్ ఎన్నికల్లో కొట్లాడుదామని, అధికారంలోకి రావడానికి అమలుకాని హామీలిచ్చి రేవంత్‌రెడ్డి ప్రజలను మోసం చేశాడన్నారు. మహిళలకు రూ.2500, వృద్ధులకు రూ.4వేల పెన్షన్, రైతులకు రైతుబంధు కింద రూ.15 వేలు, వరికి రూ.500 బోనస్ ఇస్తానని చెప్పి మాటతప్పాడని మండిపడ్డారు.

మార్పు కోసం కొత్త ప్రభుత్వాన్ని ఎన్నుకున్న ప్రజలు అదే మార్పుతో బీఆర్‌ఎస్‌కు ఓటు వేయాలని సూచించారు. అతి తక్కువ రోజుల్లోనే ప్రభుత్వంపై వ్యతిరేకత వచ్చిందని, ప్రజల్లో మార్పు స్పష్టంగా కనిపిస్తున్నందున్న కార్యకర్తలు ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లి బీఆర్‌ఎస్ గెలుపు కోసం కృషిచేయాలన్నారు. కాంగ్రెస్ తప్పిదాలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీలను స్క్రీన్‌పై ప్లే చూస్తూ మీకు పథకాలు వచ్చాయా అంటూ ప్రజలను అడిగి తెలుసుకున్నారు. తెలంగాణ అభివృద్ధి బీఆర్‌ఎస్‌తోనే సాధ్యమని, బీఆర్‌ఎస్‌కు ఓటు వేసి ఎంపీ అభ్యర్థిని గెలిపించుకోవాల్సిన అవసరముందన్నారు.

కాంగ్రెస్, బీజేపీలను ఓడించాలి : ఎర్రబెల్లి

పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీలను చిత్తుచిత్తుగా ఓడించాలని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అన్నారు. గత ఎన్నికల్లో తనపై ఎలాంటి వ్యతిరేకత లేదని కేవలం ప్రజలు మార్పు కోసమే కాంగ్రెస్‌కు ఓటు వేశారన్నారు. రేవంత్ రెడ్డి బ్రోకర్ మాటలు, మోసం చేస్తూ ప్రజలను మభ్యపెడుతున్నారని, అక్రమ కేసులు పెట్టి కార్యకర్తలను ఇబ్బందులకు గురిచేయాలని చూస్తే ఊరుకునేది లేదని, వచ్చి ఎన్నికల్లో పాలకుర్తి నుంచి నిలబడి గెలుస్తామన్నారు. కడియం శ్రీహరి చరిత్ర తెలుసు, తనను చదివించింది తన తండ్రి, రాజకీయంగా సహకరించింది తానేనన్నారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిని ఓడించి బీఆర్‌ఎస్‌కు ఉత్సాహం తీసుకురావాలన్నారు.

మాజీ స్పీకర్ మధుసూదనచారి మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి అబద్ధపు మాటలు మాట్లాడుతూ ప్రజలను మభ్యపెట్టేందుకు రూ.2లక్షల రుణమాఫీ అంటున్నారని చెప్పారు. అబద్ధాల రాజకీయాలకు సమాధి కట్టాలన్నారు. మాజీ డిప్యూటీ సీఎం తాటికొండ రాజయ్య మాట్లాడుతూ కడియం శ్రీహరి దళితుడు కాదు దరిద్రుడని ఆయన్న తరిమికొట్టాలన్నారు. కడియం శ్రీహరికి రాజకీయంగా ఘనపురంలో గోరీ కడుతామని, 1994లో తాను పెట్టిన భిక్షతోనే రాజకీయాల్లో ఉన్నాడన్నారు. ఎంపీ అభ్యర్థి సుధీర్ కుమార్ మాట్లాడుతూ వరంగల్ ఎంపీగా గెలిపిస్తే ప్రతీ కార్యకర్తకు అండగా ఉంటానని, తనను ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, సత్యవతి రాథోడ్, మాజీ ఎమ్మెల్యేలు బానోత్ శంకర్ నాయక్, నన్నపనేని నరేందర్, మెట్టు శ్రీను గాంధీ నాయక్, జడ్పీటీసీ మంగళపల్లి శ్రీనివాస్, ఎంపీపీ తూర్పాటి చిన్న అంజయ్య, అన్ని మండలాల అధ్యక్షకార్యదర్శులు, నాయకులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

రూ 8.43 లక్షలు పట్టివేత


అండర్ బ్రిడ్జి వద్ద తనిఖీల్లో పాల్గొన్న ఏసీపీ

మట్టెవాడ/వరంగల్‌చౌరస్తా, ఏప్రిల్ 25: లోక్‌సభ ఎన్నికల్లో భాగంగా వరంగల్ పోలీసు సబ్ డివిజన్ పరిధిలో గురువారం వరంగల్ ఏసీపీ నందిరాం నాయక్ ఆధ్వర్యంలో మట్టెవాడ, ఎస్వీఎన్ రోడ్డు, స్టేషన్ రోడ్డు, అండర్ బ్రిడ్జి, తదితర ప్రాంతాల్లో పోలీసులు వాహన తనిఖీలు చేపట్టారు. అలాగే వరంగల్ సబ్ డివిజన్ పరిధిలో మూడు చెక్‌పోస్టు వద్ద వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో సరైన ఆధారాలు లేకుండా తీసుకెళ్తున్న నగదును సీజ్ చేశారు. రూ. 8.43లక్షల నగదు స్వాధీన పర్చుకున్నట్లు ఏసీపీ నందిరాం నాయక్ తెలిపారు. వరంగల్ పెరుకవాడకు చెందిన అంకతి ప్రవీణ్ వద్ద రూ.1.50లక్షలు, శాకరాసికుంటకు చెందిన బరుపట్ల అరుణ్ వద్ద రూ. 3 లక్షలు, వరంగల్‌కు చెందిన రాజ్‌కుమార్ అగర్వాల్ వద్ద రూ.83వేలు, హనుమకొండకు చెందిన ఆశిష్ వద్ద రూ.77,700, వరంగల్ కాశిబుగ్గ ఓసిటీ కాలనీకి చెందిన వనమాల వీరభద్రం వద్ద రూ.70,700, కరీమాబాద్ ప్రాంతానికి చెందిన సాదువుల సాంబశివరావు వద్ద రూ.60వేలు, వరంగల్‌కు చెందిన కట్టరి రవీందర్ వద్ద రూ.50,500, సిరిమల్ల శ్రీకాంత్ వద్ద రూ.51 వేలు స్వాధీన పర్చుకున్నట్లు ఏసీపీ తెలిపారు. స్వాధీన పర్చుకున్న నగదు రూ. 8,43,100 ఎలక్షన్ ఫ్లైయింగ్ స్క్వాడ్ టీమ్‌కు అప్పగించినట్లు వెల్లడించారు. తనిఖీలో మిల్స్‌కాలనీ, ఇంతేజార్‌గంజ్, మట్టెవాడ ఇన్‌స్పెక్టర్లు మల్లయ్య, మచ్చ శివకుమార్, తుమ్మ గోపి పాల్గొన్నారు.

కార్మిక వ్యతిరేక విధానాలపై పోరాడాలి



మేడే పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఏఐసీటీయూ జిల్లా ప్రధానకార్యదర్శి గన్నారపు రమేష్, తదితరులు

ఖిలావరంగల్, ఏప్రిల్ 25: కార్మిక చట్టాల పునరుద్ధరణ, కేంద్రం అనుసరిస్తున్న ప్రజా కార్మిక వ్యతిరేక విధానాలపై పోరాడాలని ఏఐసీటీయూ జిల్లా ప్రధానకార్యదర్శి గన్నారపు రమేష్ అన్నారు. గురువారం శివనగర్‌లోని తమ్మెర భవన్‌లో మేడే వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. మే 1న జరిగే మే-డే కార్యక్రమాన్ని కార్మిక, కర్షక, రైతు, మహిళా, ఉద్యోగ, ఉపాధ్యాయ తదితర అసంఘటిత కార్మికరంగాలు విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో ఏఐటీయుసీ జిల్లా డిప్యూటీ జనరల్ సెక్రెటరి మునీశ్వరుడు, జిల్లా సహాయ కార్యదర్శి దామెర కృష్ణ, జిల్లా ఉపాధ్యక్షులు ఎమ్డీ యాకూబ్, మియాపురం గోవర్ధనచారి, నాగవెళ్లి శంకర్, సంద్ర కుమార్, కలకోట్ల రాజు, అమ్ముడాల సుమలత, జన్ను శంకర్, గండి సాంబయ్య, మధుకర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్య పరిరక్షణకు ఓటే ఆయుధం

వరంగల్ జిల్లా స్వీప్ నోడల్ అధికారి భాగ్యలక్ష్మి

బల్దియా కార్యాలయంలో ముగ్గుల పోటీ


ముగ్గులను పర్యవేక్షిస్తున్న అధికారులు

వరంగల్ కార్పొరేషన్, ఏప్రిల్ 25: దేశంలో ప్రజాస్వామ్య పరిరక్షణకు ప్రధాన ఆయుధం ఓటు అని, ప్రతీ ఒక్కరు బాధ్యతగా ఓటు హక్కును వినియోగించుకోవాలని వరంగల్ జిల్లా స్వీప్ నోడల్ అధికారి భాగ్యలక్ష్మి అన్నారు. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో వరంగల్ తూర్పు నియోజకవర్గానికి సంబంధించిన స్వీప్-2024 ఓటరు అవగాహన కార్యక్రమంలో భాగంగా మెప్మా ఆధ్వర్యంలో మునిసిపల్ ప్రధాన కార్యాలయంలో గురువారం మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. బల్దియా అదనపు కమిషనర్ అనిసుర్ రషీద్ చేతుల మీదుగా ముగ్గుల పోటీలను ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి భాగ్యలక్ష్మి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. జిల్లాలో ఓటింగ్ శాతం పెంచడానికి ప్రజల్లో అవగాహన పెంచడానికి వినూత్న కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. మెప్మా, లీడ్ బ్యాంక్ వారి సహాయంతో ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్నామని చెప్పారు. ప్రజలు ఓటు హక్కును ప్రాథమిక బాధ్యతగా గుర్తించాలన్నారు. రానున్న ఎన్నికల్లో సమర్థవంతమైన నాయకుడిని ఎన్నుకోవాలంటే ఓటు హక్కును తప్పకుండా వినియోగించుకోవాలన్నారు. ఆర్టికల్ 326 ద్వారా 18 యేళ్లు నిండిన ప్రతీ ఒక్కరికి ఓటు హక్కు కల్పించామన్నారు. వంద శాతం పోలింగ్ జరిగినప్పుడే నిజమైన నాయకుడిని ఎన్నుకున్నట్లు అని అన్నారు. వృద్ధులకు, మహిళలకు ప్రత్యేక సదుపాయాలు ఏర్పాటు చేశామన్నారు.

ఈ సందర్భంగా ఓట్లు వేయిస్తామని అందరితో ప్రతిజ్ఞ చేశారు. ఈ ముగ్గుల పోటీలలో ప్రతిభ కనబరిచిన మహిళలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో పోలింగ్ మెటీరియల్ నోడల్ అధికారి విజయలక్ష్మి, పీడబ్ల్యుడీ చీఫ్ నోడల్ అధికారి సత్యలక్ష్మి, సీడీపీవో విశ్వజ, యూనియన్ బ్యాంక్ రీజినల్ మేనేజర్ సత్యం, లీడ్ బ్యాంక్ మేనేజర్ రాజు, తూర్పు నియోజకవర్గ నోడల్ అధికారి రాజేశ్‌కుమార్, టీఎంసీ రమేష్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వెంకటరమణితో పాటు సీవోలు పాల్గొన్నారు.

ఘనంగా గంగమ్మతల్లి ప్రతిష్ఠాపన


సామూహిక కుంకుమార్చనలో పాల్గొన్న మహిళలు

కరీమాబాద్, ఏప్రిల్ 25: రంగశాయిపేట బెస్తం చెరువు వద్ద నిర్వహిస్తున్న గంగమ్మతల్లి, పోతురాజుస్వామి శిఖర కలశ ప్రతిష్ఠాపన మహోత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా రెండో (గురువారం) ఉదయం ఆచార్యులు పోలోజు భాస్కరాచార్యులు, గోనుగుంట నాగేశ్వరశర్మ పురోహిత బృందం యాగశాలలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ప్రతిష్ఠా విగ్రహాల ఊరేగింపు, బలిహరణ, గ్రామోత్సవాన్ని నిర్వహించారు. గ్రామంలో నిర్వహించిన ఈ విగ్రహాల శోభాయాత్రలో భక్తులు, మహిళలు శోభాయాత్ర వాహనం ముందు నీటిని సమర్పించి మంగళహారతులతో స్వాగతం పలికి కొబ్బరికాయలు కొట్టి తమ భక్తిని చాటుకున్నారు. సాయంత్రం న్యాసవిధి, సామూహిక కుంకుమార్చన, లక్ష్మీపూజలు, మూర్తి హోమాలు, నిర్వహించారు. కార్యక్రమంలో 42వ డివిజన్ కార్పొరేటర్ గుండు చందన పూర్ణచందర్, ఆలయ కమిటీ బాధ్యులు బైరి రామేశ్వర్, ఎలుగు సాంబేశం, వెంకటేశ్వర్లు, దుర్గేష్, గురుమూర్తి, శ్రీనివాస్, నర్సింహారాములు, అశోక్, ఉపేందర్, చందర్, రమాదేవి, అమృత, సుజాత తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ తూర్పు ఎన్నికల కార్యాలయం ప్రారంభం


తూర్పు ఎన్నికల కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న గంట రవికుమార్

మిల్స్‌కాలనీ, ఏప్రిల్ 25: పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా వరంగల్ తూర్పులో బీజేపీ ఎన్నికల కార్యాలయాన్ని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్ ప్రారంభించారు. నగరంలోని దేశాయిపేట రోడ్‌లోని కేఆర్ గార్డెన్ ఎదురుగా ఎన్నికల కార్యాలయాన్ని గంట గురువారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎర్రబెల్లి ప్రదీప్‌రావు, కుసుమ సతీష్, రత్నం సతీష్‌షా, జిల్లా నాయకులు వన్నాల వెంకటరమణ, ఉపాధ్యక్షులు ఎరుకల రఘునారెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ పొట్టి శ్రీనివాస్ గుప్త, ప్రధానకార్యదర్శి బాకం హరిశంకర్, ఎస్సీ మోర్చా రాష్ట్ర నాయకులు మార్టిన్ లూథర్, మాదాసు రాజు తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్‌లో మోడల్ విద్యార్థుల ప్రతిభ

గీసుగొండ, ఏప్రిల్ 25: ఇంటర్ ఫలితాల్లో వంచనగిరిలోని మోడల్‌స్కూల్, కేజీబీవీ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. మోడల్‌స్కూల్ ఇంటర్ విద్యార్థులు 81శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ప్రిన్సిపాల్ నాగేశ్వరావు తెలిపారు. బీపీసీలో బి.పావని 931 మార్కులు సాధించగా, కీర్తి 864, సౌజన్య 845 మార్కులు సాధించినట్లు చెప్పారు. ఎంపీసీలో కె.సుశ్మిత 867, నవ్య 853, శశ్వంత్ 831 మార్కులు సాధించారన్నారు. ఎంపీహెచ్‌డబ్ల్యులో డి.శిరీష 1000 మార్కులకు గాను 974 మార్కులు సాధించి టాప్‌లో నిలిచినట్లు స్పెషల్ ఆఫీసర్ హిమబిందు తెలిపారు.

వాలీబాల్ శిక్షణ శిబిరం ప్రారంభం

గీసుగొండ, ఏప్రిల్ 25: గొర్రెకుంట జెడ్పీ పాఠశాలలో క్రీడాజ్యోతి స్పోర్ట్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వేసవి వాలీబాల్ శిక్షణ శిబిరాన్ని గురువారం ప్రారంభించారు. పీఈటీ రఘువీర్ మాట్లాడుతూ క్రీడలు మానసికోల్లాసంతో పాటు దేహదారుఢ్యానికి ఎంతగానో ఉపయోగపడుతాయన్నారు. మే 30 వరకు శిక్షణ కొనసాగుతుందని తెలిపారు.

మలేరియా నియంత్రణకు చర్యలు చేపట్టాలి

జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి వెంకటరమణ


మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో వెంకటరమణ

పోచమ్మమైదాన్, ఏప్రిల్ 25: జిల్లాలో మలేరియా నియంత్రణకు చర్యలు చేపట్టాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ కాజీపేట వెంకటరమణ అన్నారు. ప్రపంచ మలేరియా దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ కార్యాలయంలో కీటక జనిత వ్యాధులపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'మరింత సమానమైన ప్రపంచం కోసం మలేరియాపై పోరాటాన్ని వేగవంతం చేయడం' మలేరియా దినోత్సవ నినాదమని, తద్వారా 2030 వరకు 90శాతం మలేరియా కేసులను నిర్మూలించగల్గుతామని ప్రపంచ ఆరోగ్య సంస్థ లక్ష్యాన్ని నిర్దేశించినట్లు తెలిపారు. వరంగల్ జిల్లాలో మలేరియా నియంత్రణ చర్యలు చేపట్టాలని, రానున్న వర్షాలను దృష్టిలో ఉంచుకొని ఇప్పటి నుంచే వ్యాధి ప్రభావిత ప్రాంతాలలో వ్యక్తిగతంగా, కుటుంబ పరంగా ఇంటింటి సర్వే చేపట్టాలని సూచించారు. మలేరియా నిర్మూలనలో భాగంగా జిల్లాలోని తొమ్మిది ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో 20 గ్రామాలలో ముందస్తు జ్వర పీడిత సర్వే చేపట్టనున్నామని, మలేరియా వ్యాధి లక్షణాలు గుర్తించి చికిత్స అందించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వైద్యాధికారులు డాక్టర్ కిరణ్, డాక్టర్ యశస్విని, ఇంచార్జ్ అసిస్టెంట్ మలేరియా అధికారి మాడిశెట్టి శ్రీనివాస్, విజయేంద్రకుమార్, పాలకుర్తి సదానందం, మధుకర్, రాజశేఖర్, చక్రపాణి, కుమారస్వామి పాల్గొన్నారు.

నిజాయితీ చాటుకున్న ఆటో డ్రైవర్


సీఐ సమక్షంలో ప్రయాణికురాలి నగదు, బ్యాగ్‌ను అందజేస్తున్న ఆటో డ్రైవర్ అజీమ్

వరంగల్ చౌరస్తా, ఏప్రిల్ 25: ఆటోలో ప్రయాణికురాలు నగదు, బంగారంతో కూడిన బ్యాగును మర్చిపోగా, నిజాయితీతో ఆటో డ్రైవర్ ఇచ్చిన ఘటన నగరంలో గురువారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం. హనుమకొండకు చెందిన శ్రావణి షాపింగ్ కొరకు వరంగల్‌కు బయలుదేరింది. హనుమకొండ చౌరస్తాలో ఆటో ఎక్కి వరంగల్ చౌరస్తాలో దిగింది. అయితే శ్రావణి తన బ్యాగ్‌ను ఆటోలో మరిచిపోయింది. ఈవిషయం గమనించని ఆటో డ్రైవర్ వెళ్లిపోయాడు. కాసేపటికి బ్యాగ్ పోయిన విషయం గుర్తించిన శ్రావణి ఏడుస్తూ ఇంతేజార్‌గంజ్ పోలీసు స్టేషన్‌కు పరుగులు తీసింది. తనబ్యాగ్ పోయిందని, అందులో రూ.40వేల నగదు, నాలుగు తులాల బంగారు నక్లెస్ ఉన్నట్లు ఫిర్యాదు చేసింది. అదే ఆటోలో బ్యాగ్‌ను గుర్తించిన డ్రైవర్ మహ్మద్ అజీమ్ నేరుగా ఇంతేజార్ గంజ్ పోలీసు స్టేషన్‌కు వెళ్లి అందజేశాడు. ఆ సమయంలో శ్రావణి అక్కడే ఉండడంతో పోలీసులు ఆ బ్యాగ్‌ను ఆమె అప్పగించారు. తన నిజాయితీని చాటుకున్న మహ్మద్ అజీమ్‌ను పోలీసులు అభినందించారు. వెంట నే శ్రావణి అజీమ్‌కు కృతజ్ఞతలు తెలిపింది.

సెల్‌ఫోన్ అప్పగింత...

వరంగల్ చౌరస్తా: కంగన్ హాల్‌లో ఓ మహిళ సెల్‌ఫోన్ మరిచిపోగా, అది దొరికిన వ్యక్తి పోలీసు స్టేషన్‌లో అప్పగించడంతో బాధితురాలికి అందించారు. పోలీసుల కథనం ప్రకారం. వరంగల్ బట్టలబజార్‌కు చెందిన గూడూరు రజిత గురువారం స్థానిక ఓ కంగన్‌హాల్‌కు వచ్చింది. తన రూ.15వేల విలువైన సెల్‌ఫోన్ దుకాణంలో మరి చి వెళ్లిపోయింది. ఆతర్వాత షాప్‌కు వచ్చిన రజినీకాంత్ అనే వ్యక్తికి ఆ ఫోన్ దొరకడంతో ఇంతేజార్‌గంజ్ పోలీసు స్టేషన్‌కు తీసుకొచ్చి అప్పజెప్పాడు. తర్వాత పోలీసులు రజితను పిలిపించి సెల్‌ఫోన్‌ను అప్పగించారు. రజినీకాంత్ నిజాయితీని పోలీసులు అభినందించారు. కార్యక్రమంలో స్టేషన్ ఇన్‌చార్జి ఎడ్ల రవి, పెట్రోకార్ హెడ్ కానిస్టేబుల్ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

భద్రకాళిని దర్శించుకున్న 'తీన్మార్ మల్లన్న'

వరంగల్ కల్చరల్, ఏప్రిల్ 25: వరంగల్, ఖమ్మం, నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గ అభ్యర్థిగా పోటీ చేస్తున్న 'తీన్మార్ మల్లన్న' అలియాస్ నవీన్ గురువారం భద్రకాళి అమ్మవారిని దర్శించుకున్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన ఆయనకు అర్చకులు ఆశీర్వదించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. పట్టభద్రుల ఎన్నికల సన్నాహక సమావేశంలో భాగంగా హనుమకొండకు వచ్చినట్టు పేర్కొన్నారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో వ్యక్తికి మూడు రోజుల జైలు

మట్టెవాడ, ఏప్రిల్ 25: మద్యం తాగి వాహనం నడిపిన కేసులో కొత్తపేటకు చెందిన ఈసంపెల్లి అనిల్‌కు మూడు రోజుల జైలు శిక్ష విధిస్తూ వరంగల్ సెకండ్‌క్లాస్ మెజిస్ట్రేట్ గుర్రపు వీరస్వామి గురువారం తీర్పు ఇచ్చినట్లు వరంగల్ ట్రాఫిక్ సీఐ కె.శ్రీధర్ తెలిపారు. ఈనెల 18న వరంగల్ రైల్వేస్టేషన్ నుంచి వరంగల్ చౌరస్తా వైపు అనిల్ ఆటో నడుపుతూ వెళ్తున్నాడు. హెడ్‌పోస్టాఫీస్ సెంటర్ వద్ద ట్రాఫిక్ పోలీసులు డ్రంకెన్ డ్రైవ్ నిర్వహించగా అనిల్‌కు డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుపడ్డాడు. గురువారం మెజిస్ట్రేట్ మూడు రోజుల జైలు శిక్షణను విధించారు. అనిల్ ను పరకాల సబ్ జైలుకు తరలించినట్లు ట్రాఫిక్ సీఐ తెలిపారు.

వేసవి క్రీడా శిక్షణ శిబిరాల దరఖాస్తుల గడువు 30వరకు పెంపు

వరంగల్ స్పోర్ట్స్, ఏప్రిల్25: జిల్లా స్పోర్ట్స్ అథారిటీ (డీఎస్ఏ) ఆధ్వర్యంలో హనుమకొండ జేఎన్ఎస్‌తో పాటు నగరంలోని వివిధ క్రీడా మైదానాలలో నిర్వహించనున్న వేసవి క్రీడా శిక్షణ శిబిరాల దరఖాస్తుల గడువును ఈ నెల 30 వరకు పొడిగిస్తున్నట్లు డీవైఎస్ఓ ఆశోక్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. మే1 నుంచి 31వరకు నెల పాటు పే అండ్ ప్లే (నామమాత్రపు ఫీజు) పద్ధతిన నిర్వహించనున్న వేసవి క్రీడా శిక్షణ శిబిరాల గడువు ఈనెల 25 వరకు ముగిసిన నేపథ్యంలో మరికొంత మంది విద్యార్థులకు అవకాశం కల్పించడం కోసం శిక్షణ శిబిరాల దరఖాస్తుల గడువును ఏప్రిల్ 30 వరకు పెంచామన్నారు. ఈ నెల 31వ తేదీ సాయంత్రం 5గంటలలోపు జేఎన్ ఇండోర్ స్టేడియంలో పేర్లను నమోదు చేసుకోవాలని ఆయన సూచించారు. వివరాలకు 9441086556, 9392015280, 9949271564, 9849276234, 9642963577, 9010002889 నెంబర్‌లలో సంప్రదించాలని అశోక్‌కుమార్ వెల్లడించారు.

మామునూరులో దిగిన ఉత్తరాఖండ్ సీఎం

ఘన స్వాగతం పలికిన బీజేపీ శ్రేణులు


ఉత్తరాఖండ్ సీఎంకు ఘన స్వాగతం పలుకుతున్న అభ్యర్థి రమేష్

సంగెం, ఏప్రిల్ 25 : వరంగల్ పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఉత్తరాఖండ్ సీఎం పుష్కర్‌సింగ్ దామి గురువారం వరంగల్ చేరుకున్నారు. మామునూరు ఎయిర్‌పోర్ట్‌లో మధ్యాహ్నం 3:40గంటలకు హెలికాప్టర్‌లో దిగారు. ఆయనకు పార్టీ నాయకులు ఘనం స్వాగతం పలికారు.

వరంగల్ పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి ఆరూరి రమేష్‌కు మద్దతుగా ఎన్నికల ప్రచారంలో భాగంగా నగరంలో నిర్వహించే బీజేపీ ర్యాలీకి ఆయన ముఖ్యఅతిథిగా హాజరైయ్యేందుకు వచ్చారు. మామునూరు ఏసీపీ తిరుపతి ఆధ్వర్యంలో ఎయిర్‌పోర్ట్ పరిసరాల్లో భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. సీఎం రాక కోసం వచ్చిన బీజేపీ నాయకుల కార్లను ఎయిర్‌పోర్ట్‌లోకి అనుమతించకుండా పోలీసులు చర్యలు తీసుకున్నారు. ముఖ్య నేతలను మాత్రమే అనుమతించారు. వరంగల్-ఖమ్మం జాతీయ రహదారిపై పోలీసులు సుమారు గంటపాటు వాహనాల రాకపోకలను నిలిపివేశారు. సీఎం కాన్వాయి వరంగల్‌కు బయలు దేరిన వెంటనే పోలీసులు వాహనాలను వదిలి పెట్టారు. సీఎంకు ఘన స్వాగతం పలికిన వారిలో బీజేపీ అభ్యర్థి ఆరూరి రమేష్, మాజీ ఎమ్మెల్యే మార్తినేని ధర్మారావు, జిల్లా పార్టీ అధ్యక్షుడు గంటా రవి కుమార్, ఎర్రబెల్లి ప్రదీప్ రావు, 44వ డివిజన్ కార్పొరేటర్ జలగం అనితా రంజిత్‌రావు, మాదిరెడ్డి దేవేందర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

మలేరియా దినోత్సవ ర్యాలీ

గీసుగొండ, ఏప్రిల్ 25: ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా గీసుగొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంతోపాటు పలు గ్రామాల్లోని హెల్త్ సబ్‌సెంటర్‌లో గురువారం ర్యాలీలు నిర్వహించారు. మెడికల్ ఆఫీసర్ డాక్టర్ అర్చన మలేరియా నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. కార్యక్రమంలో సీహెచ్‌వో మధుసూదనరెడ్డి, సూపర్‌వైజర్‌లు కిరణ్‌కుమార్, స్వరూప, ఏఎన్ఎంలు, హెల్త్ అసిస్టెంట్‌లు, ఆశలు పాల్గొన్నారు.



ఆంధ్రజ్యోతి WARANGAL RURAL శుక్రవారం 26 ఏప్రిల్ 2024

వరంగల్ రూరల్

• నర్సంపేట • దుగ్గొండి • చెన్నారావుపేట • ఖానాపురం • నల్లబెల్లి • నెక్కొండ • పర్వతగిరి • వర్ధన్నపేట • రాయపర్తి

జేఈఈ అడ్వాన్స్‌లో అర్హత సాధించిన సైనిక్ స్కూల్ విద్యార్థులు

ఖానాపురం, ఏప్రిల్ 25 : మండలంలోని అశోక్‌నగర్ గిరిజన సంక్షేమ సైనిక పాఠశాలకు చెందిన 19 మంది విద్యార్థులు జేఈఈ అడ్వాన్స్‌కు అర్హత సాధించినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాసస్వామి, డైరెక్టర్ వైఎస్ రావు గురువారం తెలిపారు. పాఠశాలకు చెందిన 40మంది విద్యార్థులు జేఈఈ మెయిన్స్ పరీక్షలు రాయగా 19మంది విద్యార్థులు జేఈఈ అడ్వాన్స్‌కు అర్హత సాధించినట్లు తెలిపారు. పాఠశాలలో అత్యధికంగా 85శాతం మార్కులతో కావలి ప్రశాంత్ మొదటి స్థానంలో, 77శాతం మార్కులతో రామావత్ ప్రదీప్‌కుమార్ రెండో స్థానంలో నిలిచినట్లు తెలిపారు. ఈ సందర్భంగా అర్హత సాధించిన విద్యార్థులను పాఠశాల అధ్యాపకులు అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ కళ్యాణ్, వైస్ ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

రాహుల్ ప్రధాని కావడం ఖాయం

• ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి



అలంకానిపేటలో ఎమ్మెల్యే సమక్షంలో చేరిన వివిధ పార్టీల నాయకులు

నెక్కొండ, ఏప్రిల్ 25 : రాహుల్ గాంధీ ప్రధాన మంత్రి కావడం ఖాయమని, దేశం కోసం అనేక రకాల త్యాగాలు చేసిన నెహ్రూ కుటుంబాన్ని దేశ ప్రజలు గుర్తిస్తున్నారని నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి అన్నారు. గురువారం మండలంలోని అలంకానిపేటలో వివిధ పార్టీలకు చెందిన వంద కుటుంబాలు కాంగ్రెస్ పార్టీలోచేరగా వారికి ఎమ్మెల్యే పార్టీ కండువాలను కప్పి పార్టీలో చేర్చుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రత్యేక తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చిన సోనియాగాంధీ రుణం తీర్చుకోవలసిన బాధ్యత రాష్ట్ర ప్రజలపై ఉందన్నారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. మహబూబాబాద్ ఎంపీ అభ్యర్థిగా కాంగ్రెస్ పార్టీ బలపర్చిన బలరాం నాయక్‌ను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ఆయన కోరారు. అలంకానిపేట గ్రామానికి చెందిన సొసైటీ డైరెక్టర్ కోరుకొండ మల్లయ్య మాదా సుధాకర్, ఎలేందర్, రాజేశ్వర్, వెంకన్న, లక్ష్మయ్య, కుమారస్వామి, యాకసాయిలు, సమ్మయ్య శ్రీను, మురళి, రమేశ్, సతీష్‌తో పాటు వంద కుటుంబాలు కాంగ్రెస్ పార్టీలో చేరాయి. ఈ కార్యక్రమంలో నర్సంపేట టీపీసీసీ మెంబర్ సొంటిరెడ్డి రంజిత్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు బక్కి అశోక్, పట్టణ అధ్యక్షుడు పెండ్యాల హరిప్రసాద్, యూత్ అధ్యక్షుడు రావుల మైపాల్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు సముద్రాల కనకయ్య, మండల నాయకులు కుసుమ చెన్నకేశవులు, రాచకొండ రఘు, లావుడ్యా తిరుమల్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతీ ఇంటిని గ్రంథాలయంలా మలచుకోవాలి

నర్సంపేట టౌన్, ఏప్రిల్ 25 : ప్రతి ఒక్కరూ తమ ఇంటిని గ్రంథాలయంలా మలచుకోవాలని నర్సంపేట ఏసీపీ కిరణ్‌కుమార్ అన్నారు. పట్టణంలోని లీడ్ లైబ్రరీ అండ్ లిటరరీ సెంటర్ వ్యవస్థాపకుడు కాసుల రవికుమార్ గ్రంథాలయ ఆవశ్యకతపై అవగాహన పెంచేందుకు చేపట్టిన మై హోమ్-మై లైబ్రరీ ఛాలెంజ్ కార్యక్రమ పోస్టర్‌ను గురువారం ఏసీపీ ఆవిష్కరించి మాట్లాడారు. పిల్లలకు చిన్నతనం నుంచే మంచి పుస్తకాలను పరిచయం చేయడంతో పాటు, పుస్తక పఠనాన్ని పెంపొందించే విధంగా తల్లిదండ్రులు కృషి చేయాలన్నారు. గతంలో లీడ్ లైబ్రరీ ప్రారంభించిన హగ్ ఎ బుక్ ఛాలెంజ్‌కు చక్కని స్పందన లభిస్తున్నదన్నారు. ప్రస్తుతం మై హోమ్-మై లైబ్రరీ అంటూ విద్యార్థులు సొంతంగా ఇంట్లోనే గ్రంథాలయాలను ఏర్పాటు చేసుకోవాలని సవాలు విసరడం ఎంతో గొప్ప ఆలోచన అని ఆయన అన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఏసీపీ కిరణ్‌కుమార్

వేసవి సెలవుల్లో పిల్లల పట్ల జాగ్రత్తలు తీసుకోవాలి

నర్సంపేట టౌన్,ఏప్రిల్ 25: వేసవి సెలవుల్లో పిల్లల పట్ల తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలని అంగన్‌వాడీ టీచర్ నల్లా భారతి అన్నారు. పట్టణంలోని రామాలయం అంగన్‌వాడీకేంద్రంలో విద్యార్థుల తల్లిదండ్రులకుఅవగాహన సదస్సు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పూర్వ ప్రాథమిక విద్య కార్యక్రమాల ద్వారా విద్యతో పాటు ఆటపాటలతో పిల్లల్లో శారీరక అభివృద్ధికి పునాది వేశామన్నారు. గత సంవత్సరం 40 మంది ప్రీస్కూల్ విద్యార్థులు నమోదయ్యారన్నారు. మే నెలలో పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాలకు ప్రతి రోజూ ఉదయం 8నుంచి 11గంటల వరకు పంపించాలన్నారు. ఈ కార్యక్రమంలో క్యాతం తేజశ్రీ, గడ్డం భవాని, వేల్పుల రజిత పాల్గొన్నారు.



విద్యార్థులకు వర్క్‌బుక్‌లను అందజేస్తున్న అంగన్‌వాడీ టీచర్ భారతి

ఎర్లీ చెల్డ్ కేర్‌పై అవగాహన

చెన్నారావుపేట : మండలంలోని ఉప్పరపల్లి అంగన్‌వాడీ సెంటర్‌లో ఎర్లీ చెల్డ్ కేర్‌పై అవగాహన సమావేశాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా అంగనవాడీ టీచర్ విజయలక్ష్మీ మాట్లాడుతూ అంగన్‌వాడీ సెంటర్‌లో పిల్లలకు ఆట, పాట ద్వారా నాణ్యమైన విద్యను, ప్రతి రోజూ పౌష్టికాహారాన్ని అందిస్తున్నామన్నారు. ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ఇంగ్లీషు, తెలుగు మాధ్యమంలో విద్యాబోధన చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు రజిత, సరోజన, ఆయాలు నీలమ్మ, కట్టమ్మ, శారద, కమలమ్మ తదితరులు పాల్గొన్నారు.

చేతికొచ్చిన కొడుకులు చేజారిపోయే..

యువకులను కబళించిన రోడ్డు ప్రమాదం

నలుగురి కుటుంబాల్లో విషాద ఛాయలు

అందరివీ పేద కుటుంబాలే..

కూలీ పనులు చేసుకునేవారే..

సంఘటన స్థలాన్ని పరిశీలించిన డీసీపీ

వర్ధన్నపేట రూరల్, ఏప్రిల్ 25 : వారందరివీ పేద కుటుంబాలు.. కూలీ నాలీ చేసి.. ఒక పూట పస్తులుండైనా సరే తమ కుమారులను ఉన్నత చదువులు చదివించి.. బంగారు భవిష్యత్ ఇవ్వాలనుకున్నారు. కానీ, ఆ తల్లిదండ్రుల ఆశలన్నీ కల్లల య్యాయి. చేతికొచ్చిన కొడుకులు చేజారిపోయారు. దీంతో ఆ తల్లిదండ్రులు, కుటుంబ సభ్యుల రోదన అంతాఇంతా కాదు. చాలా రోజుల తర్వాత ఒక్కచోట కలుసుకున్న స్నేహితులంతా ఆనందాలను పంచుకుని ఇళ్లకేపోయే సమయంలోనే వారిని మృత్యువు కబళించడంతో ఆ నలుగురు విద్యార్థుల కుటుంబాల్లో తీవ్రవిషాదం నెలకొంది. ఇద్దరు యువకులు వర్ధన్నపేట ప్రభుత్వ కళాశాలలో చదువుతుండగా, మరో ఇద్దరు హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ కళాశాలలో ఇంటర్ చేస్తున్నారు. బుధవారం ఫలితాలు రావడంతో వారితో పాటు ఇంకొందరు యువకులు ఒక్క చోటకు చేరుకున్నారు. ప్రమాదంలో మృతిచెందిన నలుగురు యువకులతో పాటు మరికొందరు కలిసి విందు ఏర్పాటు చేసుకున్నట్లు స్థానికులు తెలిపారు. వారంతా ఆ విందు అనంతరం తమ స్నేహితున్ని వర్ధన్నపేటలో దించేందుకు నలుగురు ఒకే బైకుపై ఇల్లంద నుంచి వెళ్తుండగా ప్రైవేట్ బస్సు ఢీకొని నలుగురూ మృతిచెందారు. ఈ ఘటన వారి కుటుంబాల్లో తీరని విషాదాన్ని నింపింది.

• మృతుల కుటుంబాల నేపథ్యం...

వర్ధన్నపేటపట్టణంలోని పిరంగిగడ్డ ప్రాంతానికి చెందిన పొన్నం అనురాధ-యాకయ్య దంపతులకు ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు.ఇటీవల పెద్ద కుమార్తె వివాహం కాగా, మరో కుమార్తె నిఖిల, రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన పొన్నం గణేష్‌లు తల్లిదండ్రులతో కలిసి హైదరాబాద్‌లో ఉంటున్నారు.తల్లి కూలీ పనిచేస్తుండగా, చిన్న కుమార్తె ఓ ప్రైవేటు కంపెనీలో ఉద్యోగం చేస్తోంది. వీరిద్దరూ గణేష్‌ను హైదరాబాద్‌లోని శ్రీచైతన్య కళాశాలలో ఇంటర్ చదివిస్తున్నారు. ఫలితాలు రావడంతో స్నేహితులను కలిసేందుకు గణేష్ వర్ధన్నపేటకు చేరుకోగా రోడ్డు ప్రమాదంలో మృత్యువాత పడ్డాడు.

మహబూబాబాద్ జిల్లాలోని మహబూబాబాద్ మండలం సింగారం గ్రామానికి చెందిన కాశమర్ల వెంకటేష్ దంపతులకు ఇద్దరు కుమారులు.వారిలో పెద్ద కుమారుడు వరుణ్ తేజ్ కాగా, చిన్న కుమారుడు పవన్ తేజ్. వెంకటేష్ కుటుంబం మండలంలోని ఇల్లంద గ్రామంలో కొన్ని సంవత్సరాల పాటు బతుకు దెరువు కోసం వచ్చారు. వెంకటేష్ చేనేత కార్మికుడిగా పనిచేసేవాడు. ఈ తరుణంలో వరుణ్ తేజ్ స్థానిక ప్రభుత్వ పాఠశాలలో చదువుకున్నాడు. రెండేండ్ల క్రితం ఇల్లంద నుంచి ఆలేరుకు వెళ్లి జీవిస్తున్నారు. కుమారుడు వరుణ్ తేజ్ హైదరాబాద్‌లోని శ్రీచైతన్య కళాశాలలో ఇంటర్ చదువుతున్నాడు. ఈ నేపథ్యంలో స్నేహితుడు పొన్నం గణేష్‌తో కలిసి వర్ధన్నపేటకు వచ్చాడు.



ఇల్లందలో ప్రమాదం జరిగిన సంఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న డీసీపీ సీతారాం

వర్ధన్నపేట మండలంలోని ఇల్లంద గ్రామానికి చెందిన మల్లెపాక రాజు-రజిత దంపతులకు ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. భార్యాభర్తలు దినసరి కూలీలుగా పనిచేస్తున్నారు. పెద్ద కుమారుడు మానసిక దివ్యాంగుడు కాగా, రెండో కుమారుడు సిద్దు చదువుకుంటున్నాడు. కుమార్తె సైతం కూలీ పనిచేస్తుంది. రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన మల్లెపాక సిద్దు వర్ధన్నపేట ప్రభుత్వ కళాశాలలో చదువుకుంటున్నాడు. స్నేహితులు రావడంతో తండ్రితో మళ్లీ వస్తానని చెప్పి తండ్రి బైక్ తీసుకుని వెళ్లగా, రాత్రి బైక్ ప్రమాదానికి గురైంది. మరొకరు ఇదే గ్రామానికి చెందిన పొన్నాల కుమారస్వామి-పూలమ్మ దంపతులకు ఇద్దరు కుమార్తెలు, కుమారుడు పొన్నాల రనిల్ కుమార్. వీరి కుటుంబం సైతం రోజు వారి కూలీ పనిచేసుకుని జీవిస్తున్నారు. ఇంటర్ ఫలితాల నేపథ్యంలో స్నేహితులతో కలిసి రాత్రి బయటకు వెళ్లగా, రోడ్డు ప్రమాదంలో వీరు మృతి చెందారు.

• సంఘటన స్థలాన్ని పరిశీలించిన డీసీపీ..

మండలంలోని ఇల్లంద గ్రామ శివారు ఆకేరు వాగు బ్రిడ్జి సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాద ఘటన స్థలాన్ని వెస్ట్ జోన్ డీసీపీ సీతారాం పరిశీలించారు. ఘటన జరిగిన వివరాలను వర్ధన్నపేటఏసీపీ అంబటి నర్సయ్య, సీఐ సూర్యప్రకాష్, ఎస్ఐ ప్రవీణ్ కుమార్‌లను అడిగి తెలుసుకున్నారు. ప్రమాదంజరగడానికి గల కారణాలతో పాటు అక్కడికక్కడే నలుగురు యువకులు మృతిచెందడంపై దిగ్భ్రాంతి వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా పోలీసులకు మృతుల తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసునమోదు చేసినట్లు ఎస్ఐ ప్రవీణ్ కుమార్ తెలిపారు. వర్ధన్నపేటకు చెందిన పొన్నం గణేష్‌ను తన ఇంటి వద్ద దింపేందుకు ముగ్గురు స్నేహితులు ఒకే బైక్‌పైవెళ్తున్నారు.గణేష్ బైక్ నడుపుతుండగా సిద్దు, వరుణ్ తేజ్, రనిల్ కుమార్ వెనకలా కూర్చున్నారు. ఈ నేపథ్యంలో ఇల్లంద శివారు ఆకేరు వాగు బ్రిడ్జి వద్దకు చేరుకోగా, వర్ధన్నపేట నుంచి వరంగల్ వైపు వెళ్తున్న ప్రైవేటు బస్సు వేగంగా, అజాగ్రతగా వచ్చి ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. దీంతో ముగ్గురు అక్కడికక్కడే మృతిచెందగా, ఒకరు మార్గ మధ్యలో మృతి చెందారు. దీంతో బాధిత కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదుతో కరీంనగర్ జిల్లా హుజురాబాద్ మండలం తోకలపెల్లి గ్రామానికి చెందిన బస్సు డ్రైవర్ శ్రీధర్‌రెడ్డిపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాలకు వరంగల్ ఎంజీఎంలో పోస్టుమార్టం పూర్తి చేసి సాయంకాలం 5 గంటల సమయంలో కుటుంబ సభ్యులకు అప్పగించారు.

నర్సంపేట సొసైటీ అధ్యక్షుడిగా రమణారెడ్డి



నర్సంపేట సొసైటీలో చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన బొబ్బాల రమణారెడ్డి

నర్సంపేట, ఏప్రిల్ 25 : నర్సంపేట ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం సొసైటీ చైర్మన్‌గా బొబ్బాల రమణారెడ్డిని సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పట్టణంలోని సొసైటీలో గురువారం సభ్యులతో డీసీఓ సంజీవ రెడ్డి సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో రమణారెడ్డిని అధ్యక్షుడిగా సంఘం డైరెక్టర్ మేర్గు శ్రీనివాస్ ప్రతిపాదించగా, మరో డైరెక్టర్ దామెర రవీందర్ బలపర్చారు. పోటీ లేకపోవడంతో రమణారెడ్డి సొసైటీ చైర్మన్‌గా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గత మార్చి 17న సొసైటీ చైర్మన్ మోరాల మోహన్‌రెడ్డిపై సొసైటీ డైరెక్టర్లు అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టారు. వీరి అవిశ్వాసానికంటే ముందే మోహన్‌రెడ్డి హై కోర్టును ఆశ్రయించాడు. అవిశ్వాసం నిర్వహించి ఫలితాలను వెల్లడించవద్దని హైకోర్టు డీసీఓకు హైకోర్టు ఆదేశాలు జారిచేయడంతో ఫలితాలను రికార్డుచేసి ఉంచారు. వాదోపవాదాల అనంతరం మోరాల మోహన్‌రెడ్డి పిటిషన్‌ను ఈ నెల 21న హైకోర్టు కొట్టివేసి చైర్మన్ ఎన్నిక నిర్వహించాలని ఆదేశాలు జారీచేశారు. వైస్ చైర్మెన్ మేరుగు శ్రీనివాస్ చైర్మెన్‌గా తాత్కాలికంగా బాధ్యతలు చేపట్టారు. గురువారం సొసైటీ డైరెక్టర్లతో డీసీఓ సంజీవరెడ్డి సమావేశం నిర్వహించారు. డైరెక్టర్లు ఏకగ్రీవంగా బొబ్బాల రమణారెడ్డిని చైర్మెన్‌గా ఎన్నుకున్నారు. దీంతో రమణారెడ్డి చైర్మెన్‌గా ఎన్నికైనట్లు డీసీఓ సంజీవరెడ్డి ప్రకటించారు. కార్యక్రమంలో సూపరింటిండెంట్ సుమలత, నోడల్ ఆఫీసర్ తోట శ్రీనివాస్, సొసైటీ డైరెక్టర్లు మేరుగు శ్రీనివాస్, గుజ్జుల మాధవరెడ్డి, భైరి జనార్ధన్‌రెడ్డితో పాటు దామెర రవి, బానోతు లక్ష్మణ్, తిరుపతి సిబ్బంది పాల్గొన్నారు.

అభినందించిన ఎమ్మెల్యే మాధవరెడ్డి

నర్సంపేట ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం సొసైటీ చైర్మన్‌గా ఏకగ్రీవంగా ఎన్నికైన బొబ్బాల రమణారెడ్డిని గురువారం పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి పార్టీ శ్రేణులతో కలిసి శాలువా కప్పి బొకేను అందజేసి అభినందించారు. కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ అధికార ప్రతినిధి తక్కళ్ళపల్లి రవీందర్‌రావు, పీసీసీ సభ్యుడు పెండెం రామానంద్, మునిసిపల్ ఫ్లోర్ లీడర్ వేముల సాంబయ్యగౌడ్, మాజీ మార్కెట్ చైర్మన్ పాలాయిశ్రీనివాస్, దండెం రతన్‌కుమార్, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కర్నాటి పార్వతమ్మ, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బానోతు లక్ష్మణ్ నాయక్, కత్తి కిరణ్, నిరంజన్‌రెడ్డి, గాజుల రమేశ్, మేరుగు సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

అబద్ధాలతో కాంగ్రెస్ గద్దెనెక్కింది

ఎంపీ ఎన్నికల సన్నాహక సమావేశంలో హరీష్‌రావు



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి ఎర్రబెల్లి

తొర్రూరు రూరల్ (మహబూబాబాద్ జిల్లా), ఏప్రిల్ 25 : కాంగ్రెస్ ప్రభుత్వం అబద్ధాలతో గద్దెనెక్కిందని.. పూర్తిస్థాయిలో ఆరు గ్యారెంటీలు వచ్చిన వారు కాంగ్రెస్‌కు.. రానీ వారు బీఆర్ఎస్ ఓటు వేయాలని బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు పిలుపునిచ్చారు. తొర్రూరు మండలం వెల్లికట్టె గ్రామశివారులో గురువారం జరిగిన వరంగల్ పార్లమెంట్ ఎన్నికల సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజా సమస్యలే ఎజెండా, కాంగ్రెస్ బీజేపీ మోసాలను ఎండగడుతూ పార్లమెంట్ ఎన్నికల్లో కొట్లాడుదామని, అధికారంలోకి రావడానికి అమలుకాని హామీలిచ్చి రేవంత్‌రెడ్డి ప్రజలను మోసం చేశాడన్నారు. మహిళలకు రూ.2500, వృద్ధులకు రూ.4వేల పెన్షన్, రైతులకు రైతుబంధు కింద రూ.15 వేలు, వరికి రూ.500 బోనస్ ఇస్తానని చెప్పి మాటతప్పాడని మండిపడ్డారు. మార్పు కోసం కొత్త ప్రభుత్వాన్ని ఎన్నుకున్న ప్రజలు అదే మార్పుతో బీఆర్ఎస్‌కు ఓటు వేయాలని సూచించారు. అతి తక్కువ రోజుల్లోనే ప్రభుత్వంపై వ్యతిరేకత వచ్చిందని, ప్రజల్లో మార్పు స్పష్టంగా కనిపిస్తున్నందున్న కార్యకర్తలు ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లి బీఆర్ఎస్ గెలుపు కోసం కృషిచేయాలన్నారు. కాంగ్రెస్ తప్పిదాలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీలను స్క్రీన్‌పై ప్లే చూస్తూ మీకు పథకాలు వచ్చాయా అంటూ ప్రజలను అడిగి తెలుసుకున్నారు. తెలంగాణ అభివృద్ధి బీఆర్ఎస్‌తోనే సాధ్యమని, బీఆర్ఎస్‌కు ఓటు వేసి ఎంపీ అభ్యర్థిని గెలిపించుకోవాల్సిన అవసరముందన్నారు.

కాంగ్రెస్, బీజేపీలను ఓడించాలి : ఎర్రబెల్లి

పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీలను చిత్తుచిత్తుగా ఓడించాలని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అన్నారు. గత ఎన్నికల్లో తనపై ఎలాంటి వ్యతిరేకత లేదని కేవలం ప్రజలు మార్పు కోసమే కాంగ్రెస్‌కు ఓటు వేశారన్నారు. రేవంత్ రెడ్డి బ్రోకర్ మాటలు, మోసం చేస్తూ ప్రజలను మభ్యపెడుతున్నారని, అక్రమ కేసులు పెట్టి కార్యకర్తలను ఇబ్బందులకు గురి చేయాలని చూస్తే ఊరుకునేది లేదని, వచ్చే ఎన్నికల్లో పాలకుర్తి నుంచి నిలబడి గెలుస్తామన్నారు. కడియం శ్రీహరి చరిత్ర తెలుసు, తనను చదివించింది తన తండ్రి, రాజకీయంగా సహకరించింది తానేనన్నారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిని ఓడించి బీఆర్ఎస్‌కు ఉత్సాహం తీసుకురావాలన్నారు. మాజీ స్పీకర్ మధుసూదనచారి మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి అబద్ధపు మాటలు మాట్లాడుతూ ప్రజలను మభ్యపెట్టేందుకు రూ.2లక్షల రుణమాఫీ అంటున్నారని చెప్పారు. అబద్ధాల రాజకీయాలకు సమాధి కట్టాలన్నారు. మాజీ డిప్యూటీ సీఎం తాటికొండ రాజయ్య మాట్లాడుతూ కడియం శ్రీహరి దళితుడు కాదు దరిద్రుడని ఆయన్న తరిమికొట్టాలన్నారు. కడియం శ్రీహరికి రాజకీయంగా ఘనపురంలో గోరీ కడుతామని, 1994లో తాను పెట్టిన భిక్షతోనే రాజకీయాల్లో ఉన్నాడన్నారు. ఎంపీ అభ్యర్థి సుధీర్ కుమార్ మాట్లాడుతూ వరంగల్ ఎంపీగా గెలిపిస్తే ప్రతీ కార్యకర్తకు అండగా ఉంటానని, తనను ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, సత్యవతి రాథోడ్, మాజీ ఎమ్మెల్యేలు బానోత్ శంకర్ నాయక్, నన్నపనేని నరేందర్, మెట్టు శ్రీను గాంధీ నాయక్, జడ్పీటీసీ మంగళపల్లి శ్రీనివాస్, ఎంపీపీ తూర్పాటి చిన్న అంజయ్య, అన్ని మండలాల అధ్యక్షకార్యదర్శులు, నాయకులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

హక్కులను కాలరాస్తున్న ప్రభుత్వాలు

నర్సంపేట, ఏప్రిల్ 25: కార్మికుల హక్కులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కాలరాస్తున్నాయని బీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు గోనె యువరాజ్ అన్నారు. పట్టణంలోని వ్యవసాయ మార్కెట్‌లో గురువారం హమాలీ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి కొల్లూరి లక్ష్మీనారాయణ అధ్యక్షతన సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రోజుకు 8గంటల పని విధానాన్ని అమలు చేయాలని, కనీస వేతన చట్టం ఉండాలని, కార్మికుల హక్కుల కోసం పోరాటం చేయడానికి సమ్మె చేసుకునే హక్కు ఉండాలని డిమాండ్ చేశారు. పోరాడి సాధించుకున్న చట్టాలను బీజేపీ ప్రభుత్వం వాటికి తిలోదకాలు ఇస్తుందని విమర్శించారు. ఎన్నికల సమయంలో కార్మికులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో హమాలి యూనియన్ డివిజన్ అధ్యక్షుడు బొల్లం ప్రసాద్, గాండ్ల రాములు, భిక్షపతి, అనిల్ పాల్గొన్నారు.

జీపు, ద్విచక్ర వాహనం ఢీ.. యువకుడి మృతి



దేవేందర్ (ఫైల్)

చెన్నారావుపేట, ఏప్రిల్ 25 : జీపు, ద్విచక్ర వాహనం ఢీ కొట్టడంతో ఓ యువకుడు మృతి చెందిన సంఘటన గురవారం సాయంత్రం లింగగిరి-నెక్కొండ ప్రధాన రహదారిపై చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం... మండలంలోని తోపనగడ్డతండాకు చెందిన తునుగోడు వెంకన్న కుమారుడు దేవేందర్ (21) పని నిమిత్తం తన ఇంటి వద్ద నుంచి ద్విచక్ర వాహనంపై లింగగిరి గ్రామం వైపు వెళుతున్నాడు. ఇదే క్రమంలో పాపయ్యపేట గ్రామం నుంచి నెక్కొండకు ప్రయాణికులతో జీపు వెళుతుంది. లింగగిరి గ్రామ సమీపంలో ఇటుక బట్టీల వద్ద దేవేందర్ ముందు వెళ్లుతున్న ఆటోను తప్పించబోయి ఎదురుగా వస్తున్న జీపును ఢీకొట్టింది. దీంతో దేవేందర్ చాతికి, ముఖానికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే ఆస్పత్రికి తరలించారు. వరంగల్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ దేవేందర్ మృతి చెందాడు. కాగా, పోస్టుమార్టం నిమిత్తం మృత దేహాన్ని ఎంజీఎం ఆస్పత్రికి తరలించినట్లు ఎస్సై గూడ అరుణ్‌కుమార్ తెలిపారు.

ఒకరికి తీవ్ర గాయాలు...

దిచక్రవాహనం ఆదుపు తప్పటంతో ఒకరికి తీవ్ర గాయాలైన సంఘటన మండలంలోని జోజిపేట క్రాస్ రోడ్డు వద్ద గురువారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం... మండలంలోని తిమ్మరాయిన్‌పహాడ్ గ్రామ శివారు చంద్రుతండాకు చెందిన జర్పుల ఈర్య తన ద్విచక్ర వాహనంపై బియ్యంబస్తాలను తీసుకొని వస్తున్నాడు. ఈ క్రమంలో జోజిపేట క్రాస్ రోడ్డు వద్ద ద్విచక్ర వాహనం ఆదుపు తప్పి కింద పడటంతో ఈర్యకు తీవ్ర గాయాలయ్యాయి వెంటనే స్థానికులు నర్సంపేట ప్రభుత్వ అస్పత్రికి తరలించారు. ప్రస్తుతం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు.

గడ్డివాములు దగ్ధం

వర్ధన్నపేట రూరల్, ఏప్రిల్ 25: ప్రమాదవశాత్తు గడ్డివాములు దగ్ధమైన సంఘటన మండలంలోని రామోజీ కుమ్మరిగూడెంతండాలో గురువారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం... తండాకు చెందిన భూక్యా రామోజీ, మంగుల గడ్డి వాములు ప్రమాదవశాత్తు మంటలు అంటుకున్నాయి.స్థానికులు వెంటనే మంటలు ఆర్పేందుకు ప్రయత్నించారు. అప్పటికే గడ్డివాములు పూర్తిగా దగ్ధమయ్యాయి.

ఓటరు స్లిప్పుల పంపిణీ

నల్లబెల్లి, ఏప్రిల్ 25 : పార్లమెంట్ ఎన్నికల దృష్ట్యా ఓటరు స్లిప్పులను ఓటు వేసే ప్రజలకు గురువారం నల్లబెల్లి జీపీ సిబ్బంది పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి ధర్మేందర్ మాట్లాడుతూ.. మే 13వ తారీఖున ఎంపీ ఎన్నికలు జరగనున్న తరుణంలో మండల కేంద్రంలో ఓటు వేసే ప్రజలకు ఓటరు స్లిప్పులను పంపిణీ చేస్తున్నామన్నారు. అలాగే ఓటరులందరికీ పార్లమెంట్ ఎన్నికల తేదీ కన్నా ముందే ఓటరు సిప్పులను అందజేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కారోబార్ పులి చక్రపాణి, తంగేళ్ల వేణు, జీపీ సిబ్బంది, ఓటర్లు తదితరులు పాల్గొన్నారు.

ఓపెన్ పరీక్షకు.. ఒకరికి బదులు ఒకరు హాజరు

వరంగల్ ఎడ్యుకేషన్, ఏప్రిల్ 25 : ఓపెన్ స్కూల్ పరీక్షల్లో ఒకరికి బదులుగా మరొకరు పరీక్షకు హాజరైన ఘటన వరంగల్ నగరంలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే ఓపెన్ స్కూల్ టెన్త్, ఇంటర్ పరీక్షలు గురువారం నుంచి ప్రారంభమయ్యాయి. వరంగల్ మండలం నరేంద్ర నగర్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రంలో పరీక్ష రాసేందుకు ఒకరికి బదులుగా మరొకరు టెన్త్ పరీక్ష రాస్తుండగా పరిశీలనకు వచ్చిన డీఈవో వాసంతి గుర్తించారు. దీంతో డీఈవో ఆదేశాల మేరకు పరీక్ష కేంద్రం నిర్వాహకులు మట్టెవాడ పోలీస్ స్టేషన్‌లో ఇద్దరు విద్యార్థులపై ఫిర్యాదు చేశారు.

• నిబంధనలకు విరుద్ధంగా ఇన్విజిలేటర్లు...

ఓపెన్ టెన్త్, ఇంటర్ పరీక్షల్లో ఇన్విజిలేటర్ల నియామకం ఇష్టారాజ్యంగా మారినట్లు పలువురు ఉపాధ్యాయులు ఆరోపిస్తున్నారు. ఓపెన్ టెన్త్, ఇంటర్ పరీక్షల్లో విధులు నిర్వర్తిస్తే సంపాదిత సెలవులతో రూ. 10వేల నుంచి రూ. 15వేల వరకు అదనంగా వస్తుండటంతో ఈ డ్యూటీలు చేసేందుకు కొంత మంది ఉపాధ్యాయులు పైరవీలు చేసుకొని మరీ డ్యూటీలు చేస్తున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఓపెన్ స్కూల్ స్టడీ సెంటర్‌లో కౌన్సిలర్లుగా చేసేవారికి విధులు కేటాయించిన తర్వాతనే సీనియారిటీని బట్టి అదే పాఠశాల లేదా పక్కనున్న పాఠశాలలోని ఉపాధ్యాయులకు డ్యూటీలు వేయాల్సి ఉండగా అలా కాకుండా ఇష్టారీతిన డ్యూటీలు వేసినట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

ప్రభుత్వ భూములను కాపాడడంలో అధికారుల నిర్లక్ష్యం



మాట్లాడుతున్న సీపీఎం పట్టణ కార్యదర్శి శ్రీధర్

నర్సంపేట, ఏప్రిల్ 25 : ప్రభుత్వ భూములను కాపాడడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని సీపీఎం పట్టణ కార్యదర్శి హన్మకొండ శ్రీధర్ అన్నారు. పట్టణంలోని 702సర్వే నంబర్ ప్రభుత్వ భూమిలో అక్రమ నిర్మాణాలను గురువారం పరిశీలించాక ఆయన మాటాడారు. ఈ సర్వే నంబర్ ప్రభుత్వ భూమిలో అక్రమనిర్మాణాలు జరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. 111 సర్వే నంబర్‌లో నిరుపేద కుటుంబం స్థలంకొనుగోలు చేసి ఇళ్లు నిర్మిస్తుంటే ఇది ప్రభుత్వ భూమి అని ఇల్లు నిర్మించుకునేందుకు అనుమతి ఉండదంటూ రెవెన్యూ అధికారులు, మునిసిపల్ అధికారులు ఇంటి నిర్మాణ పనులను కూల్చి వేశారన్నారు. 702 సర్వే నంబర్ ప్రభుత్వ భూమిలో ఓ ఉన్నత వ్యక్తి రాత్రికి రాత్రే రేకుల షెడ్డు నిర్మిస్తుండగా, ఫిర్యాదు చేసినా అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోలే దని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు కందికొండ రాజు, మొలుగూరి రాజు, దాసరి నరేశ్, మద్దెల నాగరాజు, వీరన్న, మేములపల్లి సుధాకర్, పులిచేరు చందు, జార్జ్‌విక్టర్, నరసింహారావు పాల్గొన్నారు.

బీరన్న ఉత్సవాలు ప్రారంభం

దుగ్గొండి, ఏప్రిల్ 25 : మండలంలోని తొగర్రాయిలో గురువారం బీరన్న స్వామి పండుగ ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. కురుమ గొల్ల కులస్థులు ఈ సందర్భంగా కుటుంబ సమేతంగా పూజలో పాల్గొన్నారు. ఎంపీపీ కాట్ల కోమల భద్రయ్య, కుల పెద్దలు, కమిటీ సభ్యుల మధ్య హోమ పూజలుచేశారు. నేడు బీరయ్య కామరాతి విగ్రహ ప్రతిష్ఠాపన, మే 3న లింగాలను గంగలో వేసే కార్యక్రమం, మే4న లింగాలను గంగ నుంచి తీసే కార్యక్రమం,మే 5న స్వామి వారి కల్యాణం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో అన్న లక్ష్మణ్, అన్న రాజు, కె.కుమారస్వామి, రాస చేరాలు పాల్గొన్నారు.

విద్యార్థుల యూనిఫాంలతో మహిళలకు ఉపాధి



నెక్కొండలో యూనిఫాంలు కుట్టే విధానాన్ని పరిశీలిస్తున్న డీఆర్‌డీవో

నెక్కొండ, ఏప్రిల్ 25 : ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల యూనిఫాంలు కుట్టడంలో మహిళలు నైపుణ్యతను కనబర్చితే ఇంటి దగ్గర ఉండి ఉపాధిని పొందవచ్చని డీఆర్‌డీవో కౌసల్యదేవి అన్నారు. గురువారం నెక్కొండలోని వెలుగు కార్యాలయంలో మహిళలు యూనిఫాంలు కుట్టే విధానాన్ని ఆమె పరిశీలించారు. ఈ సందర్భగా కౌసల్యదేవి మాట్లాడుతూ విద్యార్థులకు సంబంధించిన యూనిఫాంలు కొలతల ప్రకారం విద్యార్థులకు సరిపోయే విధంగా కుట్టడంలో మహిళలు నైపుణ్యతను ప్రదర్శించాలని సూచించారు. కార్యక్రమంలో ఏడీఆర్‌డీవో రేణుకాదేవి, ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్, డీపీఎం భవాని, ఏపీవో శ్రీనివాస్, ఏపీవో జాకోబ్, మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు మార్త లావణ్య, సీసీలు రవీందర్, పాల్గొన్నారు.

• ఉపాధి హామీ పనుల పరిశీలన

ఖానాపురం : బుధరావుపేటలో చేపట్టిన జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పనులను గురువారం డీఆర్డీవో కౌసల్యదేవి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఉపాధి కూలీలతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. పని ప్రదేశంలో కనీస సౌకర్యాలులేవని కూలీలు డీఆర్డీవో దృష్టికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో ఎంపీడీవో భారతి, ఏపీవో సునీత, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

• పనులను సద్వినియోగం చేసుకోవాలి

వర్ధన్నపేట రూరల్ : గ్రామ ప్రజలు ఉపాధిహామీ పనులను సద్వినియోగం చేసుకోవాలని పంచాయతీ కార్యదర్శి రాజు తెలిపారు. గురువారం మండలంలోని కడారిగూడెంలో జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ పనులు నెల రోజుల పాటు చేసి రూ.30 వేలు సంపాదిద్దామని తెలిపారు. కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ సంధ్య, ఎస్.రాజు తదితరులు పాల్గొన్నారు.